ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





8 ఊర పిచ్చుక.. ఊసేదీ..?

● సెల్ ఫోన్ కాలుష్యంతో మాయమైన ఆత్మ బంధువులు

మా వాళ్లకి

వాటా ఇవ్వాల్సిందే





గుంటూరు పట్టాభిపురంలో మద్యం దుకాణం వద్ద మందుబాబులు



- స్టాక్‌పై డిపోల్లో కొనసాగుతున్న గందరగోళం
- చాలా ప్రాంతాల్లో ప్రారంభంకాని దుకాణాలు
- మద్యం ధరలు యథావిధిగానే.. అమల్లోకి రాని కొత్త ధరలు

మద్యం లైసెన్సీలపై రాజకీయ ఒత్తిళ్లు

ప్రభుత్వ మద్యం.. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వచ్చేసింది. అదృష్టంతో దక్కించుకున్న వారు ఆనందంతో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకునే హడావుడిలో ఉండగా వారికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసిన వారికి.. నేతల అండ ఉన్నా వారికి.. మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారిలో చాలామందికి లాటరీలో దుకాణాలు దక్కలేదు. దీంతో వీరంతా దుకాణాలు దక్కించుకున్న వారిపై కన్నేశారు. తమకు వాటా ఇవ్వాలని.. తమ వారిని భాగస్వాములుగా చేర్చుకోవాలనే డిమాండ్లతో పలువురు ఒత్తిళ్లు తెస్తున్నారు. తాము చెప్పినట్లు చేయకపోతే తమ ప్రాంతంలో వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామనే హెచ్చరికలు.. బెదిరింపులు కూడా లైసెన్సీలకు వస్తున్నాయి. మరోవైపు తమ ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయవద్దని స్థానికుల నుంచి నిరసనలు వస్తున్నాయి. ఇక మద్యం ధర తగ్గకపో వడంతో మందుబాబులు నిరాశలో ఉండగా.. స్టాకుపై సాం కేతిక అవాంతరాలతో దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో బుధవారం నుంచి దుకాణాలు ప్రారంభానికి నోచుకోలేదు.

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కోసం లాటరీ ప్రక్రియ ముగిసింది. తొలి వాయిదా లైసెన్సు ఫీజును లాటరీ విజేతలు చెల్లించేశారు. స్టాక్ కోసం డిపోల్లో ఇండెంట్ పెట్టి షాపు ప్రారంభించుకోవడానికి లైసెన్సీదారులు సిద్ధపడుతున్నారు. అయితే తొలి నుంచి మద్యం వ్యాపారం చేజిక్కించుకోవాలని.. దుకాణాలను దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నించిన నేతలు, వారి అనుచరులు టీడీపీ అధిష్ఠానం హెచ్చరికలతో వెనక్కితగ్గారు. అయితే వీరు తిరిగి ఎలాగైనా మద్యం వ్యాపారంపై పట్టు సాధించాలని లైసెన్సీదారులపై ఎవరిస్థాయిలో వారు ఒత్తిళ్లు తెస్తున్నారు. కొన్ని చోట్ల నేతల అండతో వారి అనుచరగణం భాగస్వామ్యం దక్కించుకోవడానికి పట్టు వీడడం లేదు. తమను కాదని వ్యాపారం చేసే పరిస్థితి ఉండదని, కొంతమందిని భాగస్వాములుగా చేర్చుకోమని లైసెన్సుదారులకు ఫోన్ చేసి మరీ బేరసారాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. లైసెన్సు పొందిన వారిలో చాలామంది అంతకు ముందు నలుగురు నుంచి పది మంది వరకు కలిసి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఇప్పుడు వారిలో ఒక్కరికి తగిలినా సరే ఆ షాపులో వారంతా భాగస్వాములుగానే ఉండి నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎక్కువగా భాగస్వాములు ఉంటే ఇప్పుడు నేతలు చెప్పిన వారిని చేర్చుకుంటే తమకు మిగిలేది ఏముంటుందనే భావనను వారు వ్యక్తపరుస్తున్నారు. లాటరీలో షాపు దక్కించుకున్న స్థానికేతరులను పిలిచి తాము సూచించిన వారిని వ్యాపారంలో భాగస్వాములు చేసుకోవాలనే ఒత్తిడికి నేతలు తెరలేపినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలను కాదని మద్యం వ్యాపారం చేయడం అంత సులువైన విషయం కాదు. అధికార పార్టీ కాబట్టి వారి ఆదేశాలను ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ ఇతర శాఖల అధికారులు తూచా తప్పకుండా పాటిస్తారు. ఈ నేపథ్యంలో స్థానిక నేతలను కాదని మద్యం వ్యాపారం చేయడం సాహసంతో కూడుకున్న పనిగా వ్యాపారులు బావిస్తున్నారు. నేతల ఒత్తిడి ఎక్కువ అవడంతో ఏం చేయాలో తోచక వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. నేతల మాట కాదని ముందుకెళ్తే ఎన్నో ఇబ్బందులు పడతాం.. ఆ విధంగా వెళ్లడం కూడా కరెక్ట్ కాదని కొందరు ఆలోచన చేస్తున్నారు. ఇక మద్యం సరఫరాలో డిపోల వద్ద గందరగోళం నెలకొంది. బాపట్ల జిల్లాలో 117 షాపులు బుధవారం ప్రారంభం కావాల్సి ఉండగా అన్నీ కలిపి 53 దుకాణాల్లో మాత్రమే తొలిరోజు అమ్మకాలు జరిగాయి. మద్యం స్టాక్ విషయంలో బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపుల వారు తెనాలి డిపో నుంచి, అద్దంకి, పర్చూరు, చీరాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపులకు ఒంగోలు డిపో నుంచి స్టాక్ తెచ్చుకోవాల్సి ఉంది. అయితే స్టాక్ విషయంలో సదరు డిపోల్లో స్పష్టత లేకపోవడంతో ఇండెంట్ కోసం వెళ్లిన లైసెన్సుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 129 షాపులకు 75 షాపులకు మాత్రమే బుధవారం డిపోల నుంచి మద్యం సరఫరా జరిగింది. మద్యం నిల్వలకు డబ్బు చెల్లించిన వారికి డిపోల నుంచి మద్యం సరఫరా చేయలేకపోయారు. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కూడా నెలకొంది. మరికొందరు దుకాణాల ఏర్పాట్లలో ఉన్నారు. గురువారానికి నూతన పాలసీ ప్రకారం మద్యం దుకాణాలు తెరుచుకునే అవకాశం ఉండవచ్చు.

చీరాలలో యువనేత అత్యుత్సాహం..

చీరాల నియోజకవర్గంలో ఉన్న 20 షాపులకు 7 షాపుల వరకు వైసీపీ సానుభూతిపరులు దక్కించుకున్నారు. మరో 5 షాపులను ఎన్నికలకు ముందే జాతీయ పార్టీ తీర్థం పుచ్చుకున్న సదరు నేత అనుచరగణం చేజిక్కించుకుంది. దీంతో మద్యం షాపుల విషయంలో అధికారపార్టీకి చెందిన ఓ యువనేత అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఏకంగా లైసెన్సుదారులకు ఫోన్ చేసి వాటా సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. తమ కనుసన్నల్లోనే వ్యాపారం జరగాలనే హుకుం జారీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. రేపల్లెతో పాటు బాపట్లలో రెండు షాపుల విషయంలో బేరసారాలు జరుగుతున్నట్లు సమాచారం. లాటరీకి ముందు సిండికేట్ పర్వం ఒక ఎత్తయితే రూరల్ మండలాల పరిధిలో షాపులు దక్కించుకున్న వారంతా కలిసి రింగ్ అవుతున్నట్లు తెలుస్తోంది. లోకేషన్ విషయంతో పాటు ఇతరాత్ర వాటిలో తమలో తాము విభేదాలకు దిగితే నష్టపోతామనే అంచనాకు వచ్చిన వ్యాపారులు మధ్యేమార్గంగా షాపులన్నీ కలిసి రింగ్ అయి లాభాన్ని పంచుకోవాలనే అవగాహనకు వస్తున్నట్లు సమాచారం.

ఈ నెల 30 వరకు ఎక్కడైనా....

మద్యం షాపు లెసెన్సు పొందిన వారు ఈ నెల 30 వరకు తాత్కాలిక ప్రాతిపదికన, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎక్కడైనా అమ్ముకోవచ్చని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. లక్షలు పెట్టి షాపు దక్కించుకున్న వారు నష్టపోకూడదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే 30వ తేదీ తర్వాత మాత్రం శాశ్వత షాపులోనే వ్యాపారం చేయాలని ఇందులో ఎటువంటి మినహాయింపు ఉండదని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నుంచే ప్రభుత్వ మద్యం షాపులు మూసివేసి ఉండడంతో మద్యం కోసం మందుబాబులు గంటల తరబడి వేచి ఉన్నారు. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రైవేటు మద్యం షాపులు బుధవారం ఉదయం నుంచి అందుబాటులోకి వస్తాయని ఎక్సైజ్ శాఖ ప్రకటించినా మధ్యాహ్నానికి కొన్ని షాపులు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగిలినవి గురువారం నాటికి తెరుచుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఉన్న స్టాక్‌తో పాటు ఫర్నిచర్‌ను రెవెన్యూ విభాగం సమక్షంలో లెక్కకట్టి వాటిని డిపోలకు తరలించే ప్రక్రియను ఎక్సైజ్ శాఖ చేపట్టింది.

మందుబాబులకు షాక్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నూతన మద్యం పాలసీ ప్రకారం ప్రైవేట్ మద్యం దుకాణాలు కొన్ని ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. అయితే మందుబాబులు నిరాశకు గురయ్యారు. తక్కువ ధరకు, నాణ్యమైన మద్యం కోసం ఎదురుచూస్తున్న మందుబాబులు బుధవారం ప్రారంభమైన దుకాణాల్లో మద్యం ధరలు చూసి షాక్‌కు గురయ్యారు. ఆశగా మద్యం షాపులకు వెళ్లిన మందుబాబులు అక్కడి ధరలు చూసి ఖంగుతిన్నారు. నిన్నటి వరకు ప్రభుత్వ మద్యం షాపుల్లో విక్రయించిన ధరలకే ప్రైవేట్ మద్యం షాపుల్లో కూడా విక్రయాలు జరిపారు. ప్రభుత్వం చెప్పినట్టుగా రూ.99 క్వార్టర్ మద్యం ప్రైవేట్ షాపుల్లో అందుబాటులోకి ఇంకా రాలేదు. పాత ధరలే అమలు కావడంతో మందు బాబులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ఎక్సైజ్ ఈఎస్ మణికంఠను వివరణ కోరగా కొత్త ఎమ్మార్పీ ఇంకా రాలేదని, అది మారే వరకు పాత ధర లకే మద్యం విక్రయాలు జరుగుతాయన్నారు.

నష్టపోయారు.. న్యాయం చేయాలి

మా కార్యకర్తలకు మీ షాపులో 25 పైసలు వాటా ఇవ్వాల్సిందేనని స్థానిక నేతలు మద్యం వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మా కార్యకర్తలు నష్టపోయి ఉన్నారు. వారికి కూడా మేము న్యాయం చేయాలి. మీకు రావాల్సిన వాటా ప్రకారం వారు చెల్లిస్తారు. లైసెన్సు ఫీజులో కూడా వాటా ప్రకారం చెల్లిస్తారు. మీరు కూడా మా వారితో సహకరించండి. మీకు అన్ని విధాలుగా ఉపయోగం ఉంటుందంటూ చాలా చోట్ల నేతలు లైసెన్స్‌దారులతో బేరసారాలు మాట్లాడుకుంటున్నారు. అయితే పది పైసలు వాటా మాత్రం ఇవ్వగలమని కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. కుదరదు మావారికి 25 పైసలు వాటా ఇవ్వాల్సిన అంటూ కొందరు నేతలు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో మద్యం వ్యాపారులు నేతల పక్కన ఉండే ద్వితీయ శ్రేణి నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

షాపుల ఏర్పాటుపై నిరసనలు

మద్యం షాపుల ఏర్పాటు హడావుడిలో నిర్వాహకులు ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గుంటూరు నగరం నందివెలుగు రోడ్డులోని మణి హోటల్ సెంటర్లో మహిళలు తమ ప్రాంతంలో మద్యం షాపు వద్దంటూ నిరసన చేపట్టారు. బుధవారం రోడ్డుపై టెంటేసి ఆందోళన చేపట్టారు. కాకానిరోడ్డులోని ఉదయ్ హాస్పిటల్ ఎదుట మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని స్థానికులు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు, ఈఎస్ ఏ అరుణ కుమారిలకు ఫిర్యాదు చేశారు. వివాదాస్పద స్థలంలో హాస్పిటల్ కు మధ్యలో ఏ విధంగా మద్య షాపు ఏర్పాటు చేస్తారని, తక్షణమే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాల ఏర్పాట్లను స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఊరుకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటుపై స్థానికుల నుంచి నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



గుంటూరు మణిహోటల్ సెంటర్లో ఆందోళన చేస్తున్న మహిళలు.

పల్లె ప్రగతికి..

ఇసుక గండం

- పట్టణాల్లో అభివృద్ధికి ఆటంకం
- వెంటాడుతున్న కొరత
- ఎక్కడిక్కడ నిలిచిపోతున్న అభివృద్ధి పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లెల ప్రగతిపై ఇసుక ప్రభావం పడింది. ఇసుక కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పంచాయతీలు, మున్సిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుక దొరకక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అభివృద్ధి కుంటుపడుతున్నది. ఇప్పట్లో ఇసుక కొరత తీరే పరిస్థితులు కని పించడంలేదు. ఇక ప్రైవేట్ నిర్మాణదారులు కూడా పనులను నిలిపేసుకుంటున్నారు. ఇసుక సమస్య కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపుతోంది. బ్లాక్‌లో టన్ను ఇసుక రూ 1,700 నుంచి రూ 1,800లకు కొనుగోలు చేయాల్సి ఉండటంతో ఇటు కాంట్రాక్టర్లు.. అటు నిర్మాణదారులు పనులు నిలుపుదల చేస్తున్నారు.

ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది. పెద్దఎత్తున ప్రగతి పనులకు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తున్నారు. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గోకులాలు ఇలా అనేక పనులను వారోత్సవాల్లో భాగంగా ప్రారంభిస్తున్నారు. ఒక ఉద్యమంలా ప్రగతి పనులను చేపడుతున్నారు. 1386 పనులకు రూ 157.19 కోట్లు వ్యయం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో రూ. 14.35 కోట్ల వ్యయంతో 166 పనులు చేపడుతున్నారు. ఈ పనులకు శంకుస్థాపనలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాలో పల్లెల్లో రూ 70.84 కోట్ల వ్యయంతో 620 పనులు చేపడుతున్నారు. బాపట్ల జిల్లాలో రూ 72 కోట్ల వ్యయంతో 600 పనులు చేపడుతున్నారు. ఈ పనుల్లో అత్యధికంగా సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల పనులు ఉన్నాయి. పనులను శంకుస్థాపనలు చేసి ప్రారంభిస్తున్నా వీటిని చేపట్టే పరిస్థితులు కానరావడంలేదు. ఇసుక కొరత వెంటాడుతుండటంతో ఆయా పనులు నిలిచిపోనున్నాయి. పల్లెలతో పాటు మునిసిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడిక్కడ నిలిచిపోతున్నాయి. ఇసుక సకాలంలో లభిస్తుండకపోతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తున్నారు. అర్ధాంతరంగా పనులు నిలిచిపోతుండటంతో పురాల పౌరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇసుక పుష్కలంగా సరఫరా చేస్తేనే మళ్ళీ ప్రగతి పనులు పట్టాలెక్కే పరిస్థితి ఉంది.

పల్నాడు జిల్లాలో ఇసుక నిల్వలు నిండుకుంటున్నాయి. జిల్లా మొత్తం మీద ఒక్క మాదిపాడు యార్డులోనే ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇక్కడ కూడా 9 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. ఈ యార్డు నుంచి రోజుకు 50 లారీల లోపే లోడింగ్ చేసే సామర్థ్యం ఉంది. జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్‌కు సరఫరాకు అసలు పొంతన లేదు. ఆరు ఇసుక రీచ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మైనింగ్ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇసుకని తోడేందుకు బిడ్‌లు నిర్వహించారు. ఈ పనులకు సంబంధించిన బిడ్‌లను బుధవారం సాయంత్రం వరకు ఆమోదించలేదు. కృష్ణానదికి మళ్లీ వరద వచ్చింది. సాగర్ డ్యాం నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరు ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరిపే పరిస్థితి ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలు వారం రోజులు మించి వచ్చే పరిస్థితి లేదు. ఇసుక రీచ్‌లలో గత వారం రోజుల క్రితమే తవ్వకాలు జరిపి ఉంటే ఇసుక కొరత కొంత తీరేది. ఈ దిశగా సంబంధిత యంత్రాంగం స్పందించలేదన్న విమర్శలున్నాయి. ఇసుకకు గడ్డుకాలం నెలకొందన్న అభిప్రాయం నిర్మాణదారుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పనులు కూడా ఇప్పట్లో చేపట్టే పరిస్థితి లేదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రగతి కుంటుపడటంతో పాటు కార్మికుల ఉపాధి కూడా ప్రమాదకర పరిస్థితిలో పడింది. ముందస్తు చర్యలు లేని కారణంగా ఈ పరిస్థితి దాపురించిందన్న వాదన వినిపిస్తోంది. గుంటూరు, బాపట్ల జిల్లాకు సంబంధించి కూడా ఇసుక తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు చెబుతున్నారు.

మాదిపాడు యార్డులో ఇసుక లోడింగ్



ఏడాదిగా రైల్వే గేటు మూత

- ❖ గత మార్చి నుంచి సా..గుతోన్న ఆర్‌యూబీ పనులు
- ❖ సెప్టెంబరు 10లోపు తెరుస్తామని.. ప్రకటనకే అధికారుల పరిమితం
- ❖ అప్పికట్ల-భర్తీపూడి మార్గంలో రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు

బాపట్లరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గేటు కష్టాలు తీరినట్లే.. ఆర్‌యూబీ వచ్చేసింది.. కొన్నాళ్లు ఆగితే చాలు.. ఎన్నో ఏళ్లుగా పడిన అవస్థలు పోతాయి.. అని ఆశపడిన వారి ఆశలు ఏడాదిగా అడియాశలుగా మారాయి. బాపట్ల మండలం అప్పికట్ల-భర్తీపూడి మార్గంలోని రైల్వేగేటు ఏడాదిగా మూసేశారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నా రైల్వే అధికారుల్లో చలనం లేదు. ఆర్‌అండ్‌బీ రోడ్డులో రైల్వేగేటు వద్ద రైలుకింది వంతెన (ఆర్‌యూబీ) నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన పనుల పేరుతో గత ఏడాది మార్చిలో రైల్వేశాఖ రైల్వేగేటును మూసేసింది. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ సంవత్సరం సెప్టెంబరు 10వ తేదీలోపు తెరుస్తామని ప్రకటిస్తూ గేటు వద్ద అధికారులు బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అయితే వారి ప్రకటించిన గడువు దాటి నెలవుతున్నా ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. గేటును తెరవకపోవడంతో ఇరుగ్రామాల ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. గేటుమూతతో అప్పికట్ల నుంచి భర్తీపూడి, గుడిపూడి గ్రామాలకు వెళ్లడానికి చుట్టూ తిరిగి 4 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈతేరు, గుడిపూడి రైల్వేగేటు మీదగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. భర్తీపూడి చేరుకోవాలంటే 6 కిలోమీటర్ల దూరం వరకు వెళ్ళాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రైలు కింది వంతెన నిర్మాణానికి ఇంక ఎన్నిరోజులు పడుతాయోనని భర్తీపూడి, గుడిపూడివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈతేరు-గుడిపూడి మార్గంలోని రైల్వేగేటు సాంకేతిక కారణాలతో రాత్రిళ్లు పని చేయక రాకపోకలకు తరచూ అంతరాయం కలిగి ఇబ్బంది పడుతున్నారు.



మరమ్మతుల నిమిత్తం మూసివున్న అప్పికట్ల-భర్తిపూడి రైల్వేగేటు

ముసురు.. ముంపు

- ◆ రెండు రోజులుగా వీడని వర్షం
- ◆ జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- ◆ ఉధృతంగా ప్రవహిస్తున్న పర్చూరు వాగు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు జనజీవనం అస్తవ్యస్తమైంది. అల్పపీడనం వాయుగుండంగా మారడంతో బుధవారం ముసురు వర్షం కురిసింది. జిల్లాను వీడడం లేదు. భారీ వర్షాలకు పర్చూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బాపట్ల మండల పరిధిలోని రాంనగర్‌లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజల అవస్థలు పాలయ్యారు. ఎస్పీ కార్యాలయం వెనక ఉన్న పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో తటాకాన్ని తలపించేలా నీళ్లు చేరాయి. మరో రెండు రోజుల పాటు జిల్లాకు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దనే ఆదేశాలు జారీ చేశారు. నిజాంపట్నం పోర్టులో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలతో పాటు వాగులు పొంగిపొర్లుతున్న కల్వర్టుల వద్ద పటిష్ఠ చర్యలు తీసుకునేలా ఎస్పీ తుషార్‌డూడీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 100, 112 కు డయల్ చేసి తెలపాలన్నారు. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 125.7 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సంతమాగులూరు మండలంలో 21.6 మి.మీ, కొరిశపాడు 14.2, అద్దంకి 11.2, వేటపాలెం 20.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా చెరుకుపల్లిలో 1 మి.మీ వర్షం నమోదైంది.



రాంనగర్ గ్రామంలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

- ◆ మరో రెండు రోజుల వర్ష సూచనతో అధికారుల అప్రమత్తం
- ◆ నిజాంపట్నం పోర్టులో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక

అన్నదాతల బెంబేలు...

గడచిన నెలలో ముంచెత్తిన వరదలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ఆ భారీ నష్టం నుంచి కోలుకోకముందే మళ్లీ వర్షాలు ముంచెత్తాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇంతటితో వెళ్లిపోతే పైర్లకు మేలు కలిగించేవని, కానీ మరో రెండు రోజుల పాటు వర్ష సూచన నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న పర్చూరు వాగు

నేడు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రెటరీ జోషి రాక

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రెటరీ మనోజ్ జోషి గురువారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఆయన బుధవారం సాయంత్రమే ఢిల్లీ నుంచి విజయవాడకు చేరుకొని అక్కడే బస చేశారు. గురువారం ఉదయం తొలుత ఆయన రెవెన్యూ మంత్రితో సమావేశం అవుతారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో భేటి అవుతారు. అనంతరం 11 గంటలకు జిల్లాలోని దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో భూముల రీ-సర్వే వర్క్‌పై సమీక్ష నిర్వహిస్తారు. రాత్రికి విజయవాడలో ఉండి శుక్రవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రెంటచింతల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పాలువాయి జంక్షన్ దాటిన తరువాత జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. పాలువాయిగేట్ గ్రామానికి చెందిన జవిశెట్టి శ్రీను(37) బుధవారం పాలువాయి జంక్షన్‌కు వచ్చారు. పనులు పూర్తైన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడు శ్రీనుకు ఎకరన్నర సొంత పొలం ఉండగా, మరో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని పైర్లను సాగు చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36,250 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 39,822 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3,572 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

శివ.. శివ.. ఆలయంలో అపచారం!

- ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా పూజలు
- అసిస్టెంట్లచే అభిషేకాలు చేయిస్తున్న అర్చకులు
- భక్తుల ఫిర్యాదుతో మెమోలు జారీ చేసిన ఈవో


పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం

పెదకాకాని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం అంటే ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని మల్లన్న సన్నిధిలో పూజారులు అపచారానికి పాల్పడుతున్నారు. ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వేదాలు చదివిన వారు పూజలు, అభిషేకాలు చేయకుండా వారి కింద అనధికారకంగా పెట్టుకున్న అసిస్టెంట్లచే పూజలు చేయిస్తున్నారు. దీనిపై పెదకాకానికి చెందిన పెండ్యాల నాగ సురేష్ అనే భక్తుడు నేరుగా ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలా కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వెంటనే పూజారుల వివరణ కోరుతూ వారందరికీ మెమోలు జారీ చేశారు.

ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా..

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా ఆలయ పూజారులు పూజలు నిర్వహిస్తున్నారు. వేదాలు పఠించి, కష్టపడి నేర్చుకున్న మంత్రాలను, పూజా విధానాన్ని విస్మరించి వారి కింద అనధికారికంగా నియమించుకున్న అసిస్టెంట్ల చేత పూజలు చేస్తున్నారు. దీంతో అసలు పూజారులు విధులకు డుమ్మా కొడుతున్నారు. దేవస్థానంలో ఎంతో పవిత్రమైన పూజారి వృత్తిని పక్కనపెట్టి అనేక మంది పూజారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలయంలో నిబంధనల ప్రకారం పని చేయాలి. వేదాలు చదవాలి, భక్తులకు కావాల్సిన పూజలు జరిపించాలి. వీటికి ఆలయ పూజారులు పూర్తిగా స్వస్తి పలికారు. మనల్ని అడిగేవాడు ఎవరన్నట్టుగా విధులకు హాజరు కాకుండా వ్యవహరిస్తున్నారు. ఒక్కొక్క పూజారికి నెలకు రూ.70 వేల నుంచి రూ. 80 వేలు వరకు జీతాలు దేవస్థానం నుంచి చెల్లిస్తున్నారు. వీరంతా కూడా విధులకు హాజరు కాకుండా వారి కింద అనధికారికంగా పెట్టుకున్న అసిస్టెంట్ల చేత ప్రధాన ఆలయంలో, గర్భాలయంలో పూజలు జరిపిస్తున్నారు.

రెండు వర్గాలుగా విడిపోయిన పూజారులు

దేవస్థానం పూజారులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఇటీవల ఒక వర్గంపై మరో వర్గం ఆధిపత్యం సాధించాలని వ్యూహ ప్రతి వ్యూహాలను వేస్తున్నారు. దీంతో పూజలకు డుమ్మా కొట్టడం, అభిషేకాలకు హాజరు కాకపోవడం పరిపాటిగా మారింది. ఇంతకుముందు ప్రతిరోజూ ఆలయంలో నిత్య కల్యాణాన్ని జరిపించారు. ఇప్పుడు నిత్య కల్యాణానికి మంగళం పలికారు. అర్చకుల మధ్య నెలకొన్న వర్గపోరుతో దేవస్థానానికి చెందిన పవన్ కుమార్ అనే అర్చకుడు లాంగ్ లీవ్ పెట్టి వెళ్లిపోయారు. పూజారులు ఒక వర్గంపై మరొక వర్గం ఆరోపణలు చేసుకుంటూ ఆలయ పరువు, ప్రతిష్ఠలను మంట కలపడమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్నారు.

అడ్డగోలుగా ప్లేట్ కలెక్షన్..

వాస్తవానికి రాష్ట్రంలోని దేవాలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించే క్రమంలో ప్లేట్లు పట్టుకొని భక్తుల నుంచి డబ్బులు ఆశించకూడదు. అయినా పెదకాకాని దేవస్థానంలో అర్చకులు అడ్డగోలుగా ప్లేట్ కలెక్షన్స్‌కు పాల్పడుతున్నారు. వేలాది రూపాయలు ప్లేట్ కలెక్షన్ ద్వారా తమ సొంత జేబులో నింపుకుంటున్నారు. దీంతో దేవస్థానం ఆదాయానికి గండి పడుతోంది. లక్షల రూపాయల ఆదాయాన్ని దేవస్థానం హుండీల ద్వారా కోల్పోతుంది. ఈవో శ్రీనివాస్ రెడ్డి హయాంలో అర్చకులు ప్లేట్ కలెక్షన్ ఆపేశారు. అప్పట్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి హుండీలు లెక్కించగా హుండీల ద్వారా గతంలో వచ్చే ఆదాయం కన్నా అధికంగా పెరిగింది. ఇప్పుడు మళ్లీ ప్లేట్ కలెక్షన్ ప్రారంభించారు. ఇటీవల హుండీల ఆదాయం గణనీయంగా తగ్గింది. ప్లేట్ కలెక్షన్ తక్షణమే నిలిపివేయాలని భక్తులు ఫిర్యాదు చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

విధులకు హాజరు కాకుండా, సహాయకులచే పూజలు జరిపిస్తున్న వ్యవహారంపై భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఆలయానికి చెందిన పూజారులకు మెమోలు జారీ చేసినట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు. వారి నుంచి వివరణ కోరినట్లు చెప్పారు. ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నామని, వారి వివరణ తర్వాత అందుకు బాధ్యులైన పూజారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు కూడా నివేదిక పంపుతామని పేర్కొన్నారు.

కొండమోడు జాతీయ రహదారికి రూ.881.61 కోట్లు మంజూరు

- 49.917 కి.మీ నాలుగు లైన్ల రహదారి నిర్మాణం
- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని సత్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో కొండమోడు జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం తెలిపారు. పేరేచర్ల నుంచి కొండమోడు వరకు రహదారి నిర్మాణానికి రూ. 881.61 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని ఎంపీ ఘనంగా సత్కరించారు. జిల్లా ప్రజల తరపున ఆయన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారిని కేంద్ర ప్రభుత్వంలోని భారత్ మాలా ప్రాజెక్టు కింద నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. 49.917 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారని చెప్పారు. ఈ రహదారికి సత్తెనపల్లి, మేడికొండూరులో బైపాస్ రహదారులు నిర్మిస్తారని పేర్కొన్నారు. పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ఎంపీ తెలిపారు.

ఎరువులు తక్షణమే సరఫరా చేయాలి

జిల్లాలో పంటల అవసరాలకు తగ్గట్టుగా ఎరువులు తక్షణమే సరఫరా చేయాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కెమికల్, ఫర్టిలైజర్స్ మంత్రిత్వ శాఖ కేంద్ర సెక్రెటరీ రజత్ కుమార్ మిశ్రాను కలసి వినతి పత్రం అందజేశారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో వ్యవసాయం ప్రధాన ఆధారమని, ప్రస్తుతం రబీ సాగు జరుగుతుందని, ఖరీఫ్ పంటలకు కూడా ఎరువులు అవసరం ఉందని వివరించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ నెలాఖరు నాటికి 4 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని చెప్పారు. వ్యవసాయ కార్యకలాపాలకు అంతరాయం లేకుండా కొనసాగించేందుకుగానూ చొరవ చూపి తక్షణమే రైతుల డిమాండ్‌కు తగ్గట్టుగా డీఏపీ, యూరియాలను సరఫరా చేయాలని లావు కోరారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు విద్య, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థుల వయసు 19 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండాలని, పదో తరగతి నుంచి పీజీ (2003 నుంచి 2024 విద్యా సంవత్సరాల్లో) వరకు పూర్తి చేసిన ఎవరైనా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా ఉపాధి కార్యాలయం, కావూరి కాంప్లెక్స్, గుజ్జనగుండ్ల గుంటూరు అనే చిరునామాకు ఉదయం 10 గంటలకు రావాలని సూచించారు. జాబ్‌మేళాలో హెచ్‌సీఎల్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, ఫెయిర్ డీల్, సూర్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెమాలజీ తదితర సంస్థలు పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థులు ్రుఖఇజూొ్యుఞ్ఞుఇఃజొౌ.జీ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 0863-2350060లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా నారా చంద్రబాబు నాటకోత్సవం ప్రారంభం


నాటకోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అభినయ థియేటర్ ట్రస్ట్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మూడు రోజుల పాటు జరిగే నారా చంద్రబాబు నాటకోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, టీడీపీ నాయకులు దామచర్ల శ్రీనివాస్, కంచర్ల శివరామయ్య, భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు, నాటక ప్రముఖుడు ఆలోకం పెద్దబ్బయ్య, వ్యాపారవేత్త నాగళ్ల తిరుపతయ్య ప్రారంభించారు. అనంతరం శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం, శ్రీకాకుళం జిల్లా వారిచే కొత్త పరిమళం, కేజేఆర్, కల్చరల్ అసోసియేషన్ సికింద్రాబాద్ వారిచే సాహితి సూక్తం నాటికలను ప్రదర్శించారు. ఇండియా, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం, సాహిత్యం సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది అనే అంశంతో రూపొందించిన సాహితి సూక్తం నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా గురువారం సాయంత్రం పూర్ణోదయ ఆర్ట్స్ చీరాల వారిచే నేనేం చేసుకుంటాను, సాయి కార్తీక్ క్రియేషన్ కాకినాడ వారిచే ఎడారిలో వానచినుకు నాటికలను ప్రదర్శించనున్నట్లు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. ట్రస్ట్ సలహాదారుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గద్దె లక్ష్మి పాల్గొనగా, కార్యక్రమాన్ని క్రోసూరి సుబ్బారావు, గుంటుపల్లి కృష్ణారావు, గుంటుపల్లి రమణబాబు నిర్వహించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వడ్డేశ్వరం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. తాడేపల్లి ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. తాడికొండకు చెందిన ఎస్కే మస్తాన్ (50) వెల్డర్‌గా పని చేస్తుంటాడు. విజయవాడలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో సామాన్లు కొనుక్కొని ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి తాడేపల్లి బైపాస్ వద్దకు రాగా అక్కడ ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో మస్తాన్ మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని విజయవాడ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

త్రిఫేజ్ విద్యుత్ మీటర్లు.. నో స్టాక్

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ త్రిఫేజ్ మీటర్లకు జిల్లాలో తీవ్ర కొరత నెలకొంది. కొన్ని నెలలుగా త్రిఫేజ్ మీటర్లు అంటేనే ఆ శాఖలో అధికారులు నో స్టాక్ అని సమాధానమిస్తున్నారు. దీంతో వేల రూపాయలు డిపాజిట్‌లు చెల్లించిన వినియోగదారులకు నిరీక్షణ తప్పడం లేదు. విద్యుత్ వినియోగానికి అనుగుణంగా త్రిఫేజ్ మీటర్లకు వినియోగదారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. గృహ వినియోగంతోపాటు వాణిజ్య అవసరాలకు సంబంధించి కేటగిరీ 1, 2కి నగదు డిపాజిట్‌లు చెల్లించారు. డిపాజిట్లు చెల్లించి నెలలు గడుస్తున్నా మీటర్లు మాత్రం రావటం లేదని వినియోగదారులు చెబుతున్నారు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే, స్టోర్స్‌లోనే మీటర్లు లేవు ఎలా ఏర్పాటు చేయమంటారంటూ సెక్షన్ స్థాయిలో అధికారుల నుంచి సమాధానం వ్యక్తం అవుతుంది. అవసరానికి అనుగుణంగా త్రిఫేజ్ మీటర్లతో పాటు ఇతర పరికరాలు సమకూర్చటంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా నిర్మాణ దశలో ఉన్న కొన్ని అపార్ట్‌మెంట్స్, కొత్త భవనాల యజమానులు త్రిఫేజ్ మీటర్ల కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు సిబ్బంది త్రిఫేజ్ మీటర్లు ఇప్పిస్తామంటూ రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎల్‌టీ కేటగిరీలోని సింగిల్ ఫేజ్ మీటర్ల కొరత ఉందని సమాచారం. సింగిల్ ఫేజ్ మీటర్లకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి.

ఎల్‌టీ కేటగిరీ కండక్టర్స్‌కు కట...కట

గుంటూరు సర్కిల్ పరిధిలో ఎల్‌టీ కేటగిరీ కండక్టర్స్‌కు కూడా కొంతకాలంగా తీవ్ర కొరత ఉంది. ఎల్‌టీ కేటగిరీలో అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా వేసిన లైన్‌లు కావటంతో బలహీనంగా తయారవుతున్నాయి. వర్షాలు పడిన సమయాల్లో, వేసవి సమయాల్లో విద్యుత్ వినియోగం పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు కండక్టర్స్ తెగిపోతున్న సందర్భాలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే ఐదు దశాబ్దాల కిందట వేసిన కండక్టర్స్‌నే వినియోగిస్తున్నారు. అధ్వానంగా ఉన్న కండక్టర్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆ దిశగా శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

యంత్రాంగం వైఫల్యంపై విమర్శలు...

విద్యుత్ మీటర్లతో పాటు కండక్టర్స్‌ను ఇతర పరికరాలను అందుబాటులో ఉంచాల్సిన యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఉన్నతాధికారులు అవసరానికి మించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు కొనుగోలు చేయటంలో చూపిన శ్రద్ధ కీలకమైన విద్యుత్ మీటర్లు, కండక్టర్స్‌పై చూపటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా స్టోర్స్‌ను అధికారులు సందర్శించి పరిశీలించటం తప్ప ఫలితం ఏమీలేదు.

నేటి నుంచి '108' వాహనాలు ప్రభుత్వాస్పత్రికి అనుసంధానం

- క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్యం కోసమే..
- 70 అంబులెన్స్‌లు జీజీహెచ్‌కు అనుసంధానం
- సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడి


సమావేశంలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు(మెడికల్) అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా '108' అంబులెన్స్ వాహనాలను గురువారం నుంచి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి అనుసంధానం చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే క్రమంలో 70 అంబులెన్స్ వాహనాలను జీజీహెచ్‌కు అనుసంధానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రోగులకు సత్వర వైద్యసేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు బుధవారం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల 108 కోఆర్డినేటర్లు, ఈసీజీ టెక్నీషియన్లు, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్లు, ఆర్‌ఎంవోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఎక్కడ ప్రమాదం జరిగినా క్షతగాత్రులను అత్యవసర చికిత్సల కోసం 108 అంబులెన్స్ వాహనాల్లో గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువచ్చి, తక్షణం వైద్యచికిత్సలు లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనాల్లో రోగులను జీజీహెచ్‌కు తెచ్చే క్రమంలో ముందుగానే 108 అంబులెన్స్ సిబ్బంది రోగుల వివరాలను ఆసుపత్రి అధికారులకు తెలియజేస్తే, ముందుగానే వెంటిలేటర్, ఇతర సౌకర్యాలు, వైద్యులను సిద్ధంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఆసుపత్రికి వచ్చేలోపు వాహనంలో ఉన్న క్రిటికల్ కేసులకు అందించాల్సిన ప్రథమ చికిత్సలపై జీజీహెచ్ వైద్యులు, 108 సిబ్బందికి ఫోన్‌లో తగిన సూచనలు, సలహాలు కూడా ఇస్తారని సూపరింటెండెంట్ తెలిపారు. ఇందుకోసం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవో, సీఎంవో, ఇతర ముఖ్యమైన వైద్యులతో 108 సిబ్బందికి వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీని వలన సమాచారం తెలిసి వెంటనే వైద్య సిబ్బంది అప్రమత్తమై రోగిని కాపాడేందుకు దోహదపడుతుందని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి సంఘం (హెచ్‌డీఎస్) సభ్యుడు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, ఆర్ఎంవోలు డాక్టర్ బి. సతీష్‌కుమార్, డాక్టర్ రూస్సీరాణి, డాక్టర్ యువరాణి, ఎస్పీఎం విభాగాధిపతి డాక్టర్ సీతారామ, సీఎంవో డాక్టర్ ఎస్‌కే.నిష్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

- 42వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ


దివ్యాంగుని నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినూత్నంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా ప్రజాదర్బార్ నిలుస్తుండడంతో నిర్భయంగా తమ సమస్యలు యువనేత లోకేశ్‌కు చెప్పుకునేందుకు మంగళగిరి నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి సమస్యలు చెప్పి లోకేశ్ వద్ద భరోసా తీసుకుని వెళుతున్నారు. బుధవారం 42వ రోజు ఉండవల్లి ప్రజాదర్బార్‌లో పలు విజ్ఞప్తులు వచ్చాయి. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన పి.సాంబశివరావు తాను తీవ్ర అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నానని, తనకు ఎలాంటి ఆధారం లేదని ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. యర్రబాలెంకు చెందిన ఎస్‌కె. నసీమా మాట్లాడుతూ తాను హెచ్ఐవీతో బాధ పడుతున్నానని మందులు కొనుగోలు చేసేందుకు కూడా ఆర్థిక స్థోమత లేదని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవడంతోపాటు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. పక్షవాతంతో బాధ పడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కుంచనపల్లికి చెందిన కృపారావు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నిలిపివేసిన రైతు కూలీ పెన్షన్ పునరుద్ధరించాలని యర్రబాలెంకు చెందిన సీహెచ్ రమాదేవి విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ చదివిన తన కుమారుడికి ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని నులకపేటకు చెందిన పెద్దిరాజు కోరారు. సమస్యలు విన్న లోకేశ్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి విజ్ఞప్తులివే...

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరులోని పులివాగు ఆక్రమణలు తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గుంటక సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేశ్ పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. తమకు వారసత్వంగా సంక్రమించిన 20 ఎకరాల ఇనాం భూములను స్థానికులు ఆక్రమించారని ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారని తమకు న్యాయం చేయాలని కడప జిల్లా కలశపాడు మండలం ముద్దంవారిపల్లికి చెందిన గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో గత మూడేళ్ల నుంచి పని చేస్తున్న 30 మంది బోధనేతర సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించారని, విధుల్లోకి తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని నాన్ టీచింగ్ సిబ్బంది మంత్రి లోకేశ్‌కి విజ్ఞప్తి చేశారు. ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలకు తమ ఇల్లు నీటమునిగి సామగ్రి, నిత్యావసరాలు పాడైపోయాయని, ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయని పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 8 క్రస్ట్ గేట్ల ఎత్తివేత

రెంటచింతల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 8 రేడియల్ క్రస్ట్ గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 87,889 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె. వెంకటరమణ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0768 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయిందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

64,800 క్యూసెక్కులు విడుదల

మాచర్లటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 8 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 64,800 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జున సాగర్ నీటి మట్టం 590 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6,253 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,022, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,907, 8 క్రస్ట్‌గేట్ల ద్వారా 64,800, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 1,08,782 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,08,782 క్యూసెక్కుల నీరు చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 99,065 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 99,065 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

42,845 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 45,003 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,845 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,483 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16200	334	8200	14500
నెంబరు. 5	9500	14500	నెంబరు. 5	10500	13800
273	12000	14000	273	12000	14500
341	9000	15500	341	9000	15500
4884	12000	13500	4884	15000	16500
సూపర్ 10	11000	11000	సూపర్ 10	10000	15700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18500	తేజ	10000	18500
బ్యాడిగి	9000	15000	బ్యాడిగి	9800	14000
దేవనూరు డీలక్స్	9500	15300	దేవనూరు డీలక్స్	12500	14500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కర్లపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం దిండువారిపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి పాల్గొని అక్కడ పూజలు చేశారు. ప్రజలందరికి ఆంజనేయస్వామి అండ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నామన వెంకట శివన్నారాయణ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ జడ్పీటీసీ మరుప్రోలు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్ళరాదు

రేపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తీవ్రంగా కురుస్తున్న వర్షాలకు సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ళరాదని జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు సైదానాయక్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని, వేటకు వెళ్లిన బోట్లు కూడా తిరిగిరావాలని, మత్స్యకారులు, బోటు ఓనర్లు తమ బోట్లును సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు.

తీరప్రాంతం షూటింగ్‌లకు అనుకూలం

రేపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : షూటింగ్‌లకు ఎంతో అనుకూలమైన ప్రాంతం తీరప్రాంతమని సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. నగరంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చిన్న సినిమా షూటింగ్ కోసం రేపల్లె, పెనుమూడి, నగరం తదితర ప్రాంతాలు అనువైనవని అన్నారు. నగరం కళాశాల సినిమా షూటింగ్‌లకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. సినీదర్శకుడు ఈ ప్రాంతాలను పరిశీలించి షూటింగ్‌లకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. పల్లెటూళ్ళను ప్రోత్సహించటమేకాకుండా సినిమా అవకాశాల కోసం ఎదురుచూసే స్థానికులకు అవకాశం కల్పించే ప్రయత్నమవుతుందని తెలిపారు. నటన, ఇతర విభాగాలలో ఆసక్తి ఉన్నవారికి ఈ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

వేమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అబ్బనగూడవల్లి, వరహాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి చందోలు సునీత క్షేత్రాలను సందర్శించి గ్రామాల స్థాయిలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ అధిక ఎరువులు, పురుగు మందులు వాడినందువల్ల కలిగే నష్టాలను వివరించారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు తెలిపారు. పురుగు మందులు చల్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో రెండు గ్రామాల వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

మినుము పైరులో జాగ్రత్తలు పాటించాలి

కొల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల మినుము పైరులో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఏవో మాట్లాడుతూ, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల మినుము పైరు దెబ్బ తినే అవకాశం ఉందని రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవచ్చన్నారు. పైరులో నిలిచిన వర్షపు నీటిని బయటకు తరలించుకోవాలన్నారు. సస్యరక్షణ చర్యల్లో భాగంగా మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు తగు జాగ్రత్తలు పాటించి తెగుళ్ల, అధిక వర్షాల నుంచి పంటను కాపాడుకోవాలని సూచించారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బాపట్ల భవిత వనరుల కేంద్రం వారు డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎవివి హైస్కూల్ నుంచి డిస్లెక్సియాపై అవగాహన పెంచేందుకు రెండు కిలోమీటర్లు ర్యాలీ చేశారు. ప్రతి సంవత్సరం అక్టోబరు నెల ప్రపంచ వ్యాప్తంగా డిస్లెక్సియా అవగాహన నెలగా జరుపుకుంటారని వారు అన్నారు. డిస్లెక్సియా అనేది ఒకరకమైన అభ్యాసన వైకల్యమేనని అన్నారు. వ్యాధి మాత్రం కాదన్నారు. తెలివిగా ఉన్నప్పటికి చదవటం నేర్చుకోవటంలో ఇబ్బంది ఉన్నప్పుడు ఉపయోగించే పదమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

వేమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో బలపడిన తీవ్ర అల్పపీడనం ప్రభావం వల్ల బుధవారం వేమూరు మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం 11 నుండి 12.30 గంటల వరకు కుండపోత వర్షం కురవడంతో రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారిలో భారీ వర్షం ప్రభావం వల్ల ప్రయాణీకులకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుండి గ్రామాల్లో వర్షం కురుస్తూనే ఉంది.

భర్త, బంధువులపై ఫిర్యాదు

కొల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తనపై తన కుమార్తెపై దాడి చేసిన భర్త, అతని తరుపు బంధువులపై భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిష్కింధపాలెం గ్రామానికి చెందిన పొలిమెట్ల కమలమ్మ, ఆమె భర్త ఏలీషాలు మనస్పర్థల కారణంగా గత 12 ఏళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. భర్త తరుపు బంధువులు గత నెల 18వ తేదీన పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి భర్త తల్లిని చూడాలంటూ ఒత్తిడి చేశారు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో భర్త తరుపు బంధువులు ఆమెతో పాటు కుమార్తెపై కూడా దాడి చేసి కొట్టారు. అక్కడ నుంచి ఇంటికి వెళ్లగా ఇంటి వద్దకు కూడా వచ్చి దాడి చేయడంతో ప్రాణభయంతో వేరే చోటకు వెళ్లి తల్లి, కుమార్తె తలదాచుకున్నారు. భర్త, అతని బంధువుల వల్ల తమకు ప్రాణహాని ఉందంటూ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షాలు.. అల్లాడుతున్న ప్రజలు

బాపట్ల, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా ముసురుపట్టి కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టుప్రాంతాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ళచుట్టూ నీరు చేరిన నీరు బయటకెళ్ళే పరిస్థితి కనిపించక అనేకమంది అల్లాడిపోతున్నారు. చీకటిపడితేచాలు విషపురుగులు, దోమలు ఇళ్ళల్లోకి వస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలాల మధ్య చెరువులుగా మారాయి. అక్కడ ఉండే పురుగులు ఇళ్ళల్లోకి, ఇళ్ళపైకి వస్తున్నాయి. బాపట్ల పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీ వాసుల పరిస్థితి అయితే కడుదయనీయంగా ఉంది. ఇక్కడ నివసించే ఎస్టీ కుటుంబాల వారు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. అదేవిధంగా 24వ వార్డు డ్రైవర్స్‌కాలనీలో ఇళ్ళచుట్టూ నిలిచిన వర్షపునీరు బయటకెళ్ళే పరిస్థితి కనిపించటం లేదు. 11వ వార్డులోని ఇందిరా నగర్‌కాలనీ, 5వ వార్డు వెలగావారి వీధి, శారదాపురికాలనీ, వెన్నెలకంటినగర్‌లోని లోతట్టుప్రాంతాలలో ఇదే సమస్య నెలకొని ఉంది. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆయా వార్డులలో పర్యటించి సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని అవసరమైతే మోటర్ల ద్వారా నీటిని బయటకు పంపించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆయా వార్డులలో ప్రజలు తమ సమస్యలను అధికారులకు చెప్పుకుంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడునెలలుగా మురుగునీటి మధ్యే జీవిస్తున్నామని రాజీవ్‌గాంధీకాలనీలోని ఎస్టీ కుటుంబాలవారు కన్నీటితో విన్నవించుకుంటున్నారు. అధికారులు సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి శాశ్వత ప్రాతిపదికన సమస్యలకు పరిష్కారం చూపించాల్సిన అవసరం ఎంతైనాఉంది.



బాపట్ల పట్టణంలోని 3వవార్డులో ఇళ్ళచుట్టూ నిలిచిన వర్షపునీరు

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



అప్పికట్ల గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్లరూరల్, ,అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంలో సాధ్యమౌతున్నదని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల మండలం అప్పికట్ల, మర్రిపూడి గ్రామాలలో 40లక్షలు జాతీయ ఉపాధిహామీ నిధులతో నిర్మించే పల్లెపండుగ కార్యక్రమాలలో భాగంగా సీసీరోడ్లకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెప్రగతి టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలలోని రహదార్లకు కొత్తరూపం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, డీఎల్‌డీవో సువార్తమ్మ, ఎంపీడీవో బాబురావు, పంచాయతీరాజ్ ఏఈ మోహనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, టీడీపీ నాయకులు ఇనగంటి గాంధీ, అప్పికట్ల సర్పంచ్ గుత్తికొండ రజనీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, ,అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం, కొత్తపాలెం గ్రామపంచాయతీలలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతనంగా నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామపంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి మహర్దశ కలిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్‌ల స్ఫూర్తితో గ్రామాలలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన అన్నారు. మంతెనవారిపాలెం గ్రామపంచాయతీలో రూ.16 లక్షలతో సీసీ రోడ్లకు, శ్మశానవాటిక పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తపాలెం గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించే 6 సీసీ రోడ్లకు రూ.21లక్షల పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను ఎంపీడీవో ఐ.సత్యనారాయణ, తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషా బాబు, ఏపీవో సుభాషిణి, గ్రామసర్పంచ్ దోమ వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రఘు, గ్రామపెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక బద్దంగా ముందుకెళుతున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని యాజలి గ్రామంలో బుధవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన రోడ్డునిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బనంపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, టీడీపీ నాయకులు మద్దాల ముసలయ్య, దామర్ల సురేష్, ఎ.సాంబయ్య, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పల్లప్రోలు ఆంజనేయులు, మర్రి గూడారంకయ్య, మందపాటి చిట్టి తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వేటపాలెం గ్రామ పంచాయితీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సిమెంట్ రోడ్ల పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ మంచి కలపూడి దాసు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు రావిపాటి శ్రీనివాసరావు, కావూరి కృష్ణప్రసాద్, ఎంపీటీసీ తోట రామాంజనేయులు, జాగర్లమూడి తిరుమలేశ్వరరావు, వార్డు మెంబర్లు రావూరు వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి ఐ.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎంపీపీ లలితకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి శంకుస్థాపనలు చేశారు. మండల పరిధిలోని ఆళ్లమూడి, పల్లెకోన గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీలు హాజరై ఒక్కో గ్రామంలో రూ.15 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, ఈవోపీఆర్డీ ఊహారాణి, ఏపీవో శ్రీమన్నారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పీఆర్ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆహారం అందరి హక్కు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో తయారు చేసిన చిరుధాన్యాలు, పాలు, మాంసం, మాసాలదినుసులు, తృణధాన్యాల అధారిత పోషకపదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి తెనాలి డబల్‌హార్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ పిఎస్‌వి కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సంవత్సరం ఆహార దినోత్సవం ప్రాధాన్యతను, ఆహార భద్రతను మెరుగుపర్చటానికి, ఆహారాన్ని వృధా చేయటాన్ని తగ్గించటం, మౌలికసదుపాయాలు మెరుగుపర్చటం ముఖ్యమని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ వివి సత్యనారాయణ, డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డీడీ స్మిత్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్ ఇ.గౌతమి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

● కర్లపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆహార పదార్థాల వృధాను అరికట్టాలని కర్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇనకొల్లు పోలీసురావు కోరారు. బుధవారం పాఠశాల ఆవరణలో ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి పోలీసురావు అధ్యక్షత వహించి ఆహార పదార్థాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మనం తినే ఆహారం రైతులు కష్టపడి అనేక రోజులు శ్రమించి పండిస్తున్నారని వివరించారు. కావున ఆహారాన్ని వృధా చేయరాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఇందుమతి, డి.లీలాప్రసన్నపాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ఇనకొల్లు పోలీసురావు

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రాజవోలు గ్రామంలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. చెరుకుపల్లి మండలం రాజవోలు గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. సుమారు రూ.9.80 కోట్లు నిధులతో నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి చేయ నున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధి దిశగా ముందుకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, పూషడపు కుమారస్వామి, మల్లాది రామకృష్ణ, గ్రామస్తులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

వేమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని పెనుమర్రులో రూ.10 లక్షలు, అబ్బనగూడవల్లిలో రూ.10 లక్షలు వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, జగన్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక వెలవెలబోతున్నాయన్నారు. ముఖ్యమంత్రి సారధ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో రాష్ట్ర పాలన ప్రజలకు ఆమోద యోగ్యంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లో కొక్కిలిగడ్డ సుమతి, కొండిశెట్టి రాంబాబు, మాజీ సర్పంచ్‌లు మన్నె సరస్వతి, భాగ్యలక్ష్మి, టీడీపీ నాయకులు మన్నె వేణుగోపాలకృష్ణ, రాజేష్, లావు శంకరరావు, జనసేన నాయకులు అల్లంశెట్టి సాయి, ఈవోపీఆర్‌డి శేఖర్, ఏపీవో సత్యకృష్ణ, కార్యదర్శులు సింధూజ, సురేష్‌బాబు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెనుమర్రులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

ఫెన్సింగ్ పోటీలో జమ్ములపాలెం విద్యార్థుల ప్రతిభ

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ముల పాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫెన్సింగ్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి పెన్సింగ్ పోటీలకు అండర్-17విభాగంలో జమ్ములపాలెం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఎ.మణికంఠ, కె.విజయ్, సీహెచ్ శివమణికంఠ విజేతలుగా నిలిచి ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వివి కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బోయన వీరచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులను గ్రామసర్పంచ్ బోయన వెంకటేశ్వరమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ బోయన నాగరాజు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో పాత విద్యుత్ స్తంభాలను తొలిగించి నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బుధవారం భూమి పూజ నిర్వహించారు. మంతెన వారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల వివరాలను ఎమ్మెల్యే నరేంద్రవర్మ విద్యుత్‌శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో లోఓల్టేజి సమస్య లేకుండా చూడాలని కోరారు. పాతవిద్యుత్ స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయటంపై స్థానిక విద్యుత్ కె.చంద్రశేఖర్, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మంతెనవారిపాలెం సర్పంచ్ లక్ష్మంరాజు, ఉప సర్పంచ్ వెంకటపతిరాజు, ఎంపీడీవో ఐ.సత్యనారాయణ, తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, గ్రామపెద్దలు, కూటమినాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాణా సంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బాపట్ల పట్టణంలో ఏర్పాటు చేయనున్న బాణా సంచా విక్రయ కేంద్రాలకు అవసరమైన స్థలాన్ని మున్సిపల్, ఫైర్ అధికారులు బుధ వారం పరిశీలించారు. మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో వాటి ఏర్పాట్లపై సమీక్షించారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు, పట్టణ ప్రణాళిక అధికారి ఎస్.మల్లికార్జునరావు, సర్వేయర్ డి.మాధవి, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బాణాసంచా కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తీసుకునే జాగ్రత్తలు గురించి చర్చించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు పొందిన వారు జంగా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేయాలి

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్, చిత్రంలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య

బాపట్ల, ,అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : ఎస్సీఎస్టీ కేసులలో బాధితులైన వారికి సత్వరమే న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు జనద్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డులు తప్పనిసరిగా మంజూరు చేయాలన్నారు. చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తు వేగంగా కొనసాగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులేని వారిని గుర్తించి వారి చేత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయించాలన్నారు. గడిచిన 10 నెలల్లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాపట్ల జిల్లాలో 86 కేసులు నమోదయ్యాయని అన్నారు. ఇప్పటి వరకు 68 కేసులలో బాధితులకు రూ.33 లక్షలు పరిహారం కింద ఇవ్వటం జరిగిందన్నారు. ప్రాథమిక దర్యాప్తులో ఛార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. మూడు కేసుల దర్యాప్తులకు హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. పాత ప్రకాశం జిల్లా పరిధిలోని 138 కేసులు బాపట్ల జిల్లా పరిధిలోకి రాగా అవన్నీ కోర్టు పరిధిలోనే పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

బాధితులకు మేలు చేయటానికి చట్టాలు ఉన్నాయని చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య తెలిపారు. బాధితులకు సత్వరమే పరిష్కారమార్గం చూపకపోవటంతో అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాజీపడుతున్న కేసులలో బాధితులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బాధితుల కొరకు రూపొందించిన చట్టాలను పక్కాగా అమలు చేయాలని, సత్వరమే న్యాయం చేయాలని కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, గుదే రాజారావు, పి.ప్రసాదరావు, టి.సురేష్, జి.నాగమణి కోరారు. ఎస్సీ కాలనీలలో శ్మశాన భూములు, వీధివిద్యుత్‌దీపాలు, రహదార్లు, కాల్వలు నిర్మించాలని విన్నవించారు. సమావేశంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి జె.రాజాదెబోరా, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

దీపావళి సామగ్రి విక్రయానికి అనువైన ప్రాంతాలు గుర్తించాలి

బాపట్ల, ,అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ చేసి దీపావళి సామాగ్రి విక్రయించటకు అనువైనప్రాంతాలను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక, పంచాయతీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. దీపావళి పండుగకు జిల్లాలో బాణాసంచా విక్రయించేందుకు ఆసక్తి గల వ్యాపారులు తాత్కాలిక లైసెన్స్ కొరకు ఈనెల 20 నుంచి 25వ తేదీలోపు మీసేవ, గ్రామ, వార్డు, సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు, పోలీసుసిబ్బంది పర్యవేక్షించాలన్నారు. అధికారులు గుర్తించిన ప్రదేశాలలో తప్ప ఇతరప్రాంతాలలో, రద్దీగా ఉండే ప్రదేశాలలో బాణాసంచావిక్రయాలు జరపరాదన్నారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు మూడురోజులు మాత్రమే బాణాసంచా విక్రయాలు జరపాలన్నారు. 31వ తేదీ సాయంత్రం 7 గంటలకు స్టాల్స్ ఖాళీ చేయాలన్నారు. దీపావళిపండుగ సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక,రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ, లేబర్ అధికారులు స్వయంగా పర్యవేక్షించి నిబంధనలు గురించి వివరించాలన్నారు. జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. బాణాసంచా అక్రమంగా తయారు చేయుట, నిల్వలు చేయుట ప్రమాదకరమన్నారు. చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆనందబాబు



టీడీపీ కార్యకర్త శ్యాంబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తురకపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మద్దాల శ్యాంబాబు (55) బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గ్రామానికి చేరుకుని కార్యకర్త మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని భార్య భాగ్యం, కుమార్తెను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, సర్పంచ్ టి.కృష్ణమోహన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతాం : ఎన్నారై

కొల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామని పూర్వ విద్యార్థులు కనకమేడల శివశంకర్, వెంపటి సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం పూర్వ విద్యార్థులు సందర్శించారు. సభలో ఎన్నారై శివశంకర్ మాట్లాడుతూ, పాఠశాల ఉన్నతి కోసం తాను ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. మరో పూర్వ విద్యార్థి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు మనకు అందుబాటులో ఉన్నారన్నారు. కార్యక్రమంలో బొనిగల సుబ్బారావు, ప్రసాద్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

వేమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం సాయంత్రం స్థానిక లక్ష్మీగణపతి కల్యాణ మండపంలో జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు బి.ఏడుకొండలు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా ల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసీపీ తరుపున పోటీ చేస్తు న్న గౌతమ్ రెడ్డి ప రిచయ కార్యక్రమం జరుగుతుందన్నారు.



ఊర పిచ్చుక.. ఊసేదీ..?



- సెల్‌ఫోన్ కాలుష్యంతో మాయమైన ఆత్మ బంధువులు
- ప్రమాదకర స్థాయిలో రేడియేషన్ ప్రభావంతోనే..
- మితిమీరిన సెల్‌ఫోన్ వినియోగంతో ప్రమాద ఘంటికలు
- రామచిలుక, గోరువంక, పాలపిట్ట, గుడ్లగూబల ఉనికీ ప్రశ్నార్థకమే!
- పిచ్చుకలనే కాదు.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిందే!

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఊరపిచ్చుకలు ఎక్కడికెళ్లాయో, ఏమై పోయాయో, తెలియదు. నిజం చెప్పాలంటే, ఈ తరం చిన్నారులకు ఊర పిచ్చుక ఊసే తెలియని పరిస్థితి. అంతకు మించిన విషాదం ఏముంటుంది? ఊర పిచ్చుక కనిపించకపోతే విషాదమేంటి అనుకుంటున్నారా? అది విషాదమే కాదు.. రాబోయే ప్రమాదానికి సంకేతం కూడా! ఆ విషయాలను తెలుసుకుందాం..

● సెల్‌ఫోన్ రాక.. ఆత్మబంధువు పోక!

మన ఇంట్లో నిత్యం సందడి చేసే పిచ్చుకలను ఊర పిచ్చు కలు అంటుంటారు. వీటి శాస్త్రీయ నామం పాసర్ డొమెస్టికస్ ఇండికస్. ఇది మన ఇళ్లలోనే వుంటుంది కనుక 'ఇంటి పిచ్చుక 'అని కూడా పిలవొచ్చు. ఇంటోకి వచ్చే పురుగు, పుట్రను తింటూ మనల్ని రోగాల బారి నుంచి కాపాడుతుంటాయి. అటువం టివి పిచ్చుకలు ఉన్నట్లుండి కనిపించకుండా పోయాయి. అందుకు కారణం కమ్యూనికేషన్ విప్లవమే. నాణానికి బొమ్మా.. బొరుసు వున్నట్లు.. సాంకేతిక విప్లవం వల్ల మంచీచెడూ రెండూ వుంటాయి. మూడు దశాబ్దాల క్రితం వచ్చిన కమ్యూనికేషన్ విప్లవం సెల్‌ఫోన్ రూపంలో ప్రపంచం మొత్తాన్ని చాప చుట్టి మన అరచేతిలో పెట్టింది. అప్పటి వరకూ ఉన్న తపాలా, టెలీగ్రామ్, టెలీఫోన్‌ల స్థానాన్ని సెల్‌ఫోన్ ఆక్రమించింది. విద్యుదయస్కాంత తరంగాల ద్వారా సగటు మనిషిని ప్రపంచంతో అనుసంధానం చేసింది. ఇదంతా నాణానికి ఒక వైపే. మరీ, రెండో వైపు మరోలా వుంది. సెల్‌ఫోన్ల వినియోగం కోసం భారీ స్థాయిలో సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. ఊరూవాడా అన్న తేడా లేకుండా సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో ఊరిలో నాలు గైదు సెల్ టవర్లు వుంటే, పట్టణాలు, నగరాల్లో పదులు, వందల సంఖ్యలో టవర్లు వుంటున్నాయి. సెల్ టవర్లు, సెల్‌ఫోన్ల నుంచి వచ్చే రేడియేషన్ చిన్న చిన్న జీవరాశులను, ప్రధానంగా పక్షి కోటిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రేడియేషన్‌ను తట్టుకోలేక చిన్న చిన్న పక్షులు కనుమరుగైపోయాయి. ఆ క్రమంలోనే ఊర పిచ్చుక ఊసు కూడా ఆగిపోయింది. ఈ విషయం గమనించే నాటికే ఊరపిచ్చుక ఉనికే కనుమరుగైపోయింది.

> ఊర పిచ్చుక లేని ఊరు.. ఇంటి పిచ్చుక సందడి లేని ఇల్లు ఒకప్పుడు లేదంటే.. అతిశయోక్తి కాదు! మనతోనే ఉంటూ, మనకు ఊసులు చెప్పుకుంటూ, వరండా చూరుకు వేలాడదీసిన జొన్నపొత్తులు, వరి కంకులు తింటూ, చేటతో బియ్యం చెరిగి అమ్మ ఏరిపారేసిన వడ్లగింజలను ఏరుకుని తింటూ, బుజ్జి బుజ్జి గెంతులు వేస్తూ, కిచకిచ మంటూ మనతోనే తిరిగే ఊర పిచ్చుకలు.. మన ఇంట్లోనే ఏదో ఒక మూల తన ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుని మనతోనే కలిసి బతికే ఆత్మబంధువుల వంటి ఇంటి పిచ్చుకల గురించి తెలియని పాత తరం వారు ఎవరూ ఉండరు. అయితే, మనతో అంతలా తమ జీవితాన్ని పెనవేసుకున్న ఈ ఆత్మబంధువులు మనకు దూరమైపోయాయి.

● మానవాళికి ప్రమాద సంకేతం!

గడిచిన దశాబ్దకాలంలో సెల్‌ఫోన్ వినియోగం మరింత పెరిగింది. స్మార్ట్‌ఫోన్ యుగం ప్రారంభమైంది మొదలు ప్రతి ఇంట్లో రెండూ, అంతకు మించిన సంఖ్యలో స్మార్టుఫోన్లు వుంటున్నాయి. చివరకు, పసికందులను ఊరడించడానికి సైతం స్మార్ట్ ఫోన్లను వాడేస్తున్నారు. వాటి నుంచి వచ్చే రేడియేషన్ దుష్పరిణామాలను ఏమాత్రం పట్టించుకోకుండా వాటిని వాడేస్తున్నారు. మితిమీరిన స్మార్టు ఫోన్ల వినియోగంతో విపరీతమైన రేడియేషన్ వెలువడుతోందని నిపుణులు చెబుతున్నారు. 3జీ నుంచి 4జీకి, 4జీ నుంచి 5జీకి, 5జీ నుంచి 6జీకి కమ్యూనికేషన్ వ్యవస్థ పురోగమించే కొద్దీ మానవాళిపై ఈ దుష్పరిణామాలు అధికంగా ఉండబోతున్నాయి. చిన్న ప్రాణులు అయిన పిచ్చుకల వంటివి మౌనంగా నిష్క్రమిస్తుండగా, పెద్ద ప్రాణాలైన మానవకోటిపై ఈ ప్రభావం కొద్దికొద్దిగా పడుతూ వస్తోంది. రక్తపోటు, మధుమేహం, నరాల సంబంధిత వ్యాధులు, నాడీ, గుండె సంబంధిత అనారోగ్యాలు, గర్భ సంబంధిత సమ స్యలు పెరగడానికి స్థాయిని మించిన రేడియేషన్ కూడా కారణ మని శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ చెవిలో పెట్టుకునే మనుషులు మాత్రం ఆయా సూచనలను పెడచెవిన పెడుతున్నారు. ఫలితంగా మానవాళి ప్రమాదపు టంచులకు చేరువవుతోంది.

● అవగాహన అనివార్యం..

కమ్యూనికేషన్ విప్లవ ఫలాలను అనుభవిస్తూనే, వాటి తాలూకు దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి. రాబోయే ప్రమాద తీవ్రతను మానవ సమాజానికి అర్థమయ్యేలా చెప్పేందుకు తగిన కార్యాచరణ రూపొందించు కోవాలి. అంతర్థానమైపోతున్న ఊరపిచ్చుక లాంటి మూగ జీవాల ఉదంతాలను చిన్ననాటి నుంచే పిల్లలకు తెలియజేయాలి. ఊర పిచ్చుకే కాకుండా రామచిలుక, గోరింక, గుడ్లగూబ, పాలపిట్ట వంటి వాటి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇటువంటి విషయాలను పిల్లలకు చెప్పడంతో పాటు వాటికి గల కార ణాలను చిన్నారులకు వివరించాలి. పాఠశాలలు, విద్యాలయాల్లో వాటిపై వక్తృత్వం, వ్యాసరచన, పాటలు వంటి పోటీలు నిర్వహించి అవగాహన కల్పించాలి. ప్రజల్లో కూడా అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు రూపొందించాలి.

బీసీ వసతి గృహాల్లో.. డిజిటల్ పాఠాలు



ఏర్పాటు చేయనున్న డిటిజల్ బోర్డు



గుంటూరు(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ హాస్టళ్లలో త్వరలో డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి. తొలి విడత నాలుగు వసతిగృహాల్లో బోధనకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు పంపారు. వచ్చే నెలలో ఎంపికలు పూర్తి చేసి బాలల దినోత్సవం రోజున విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 54 వసతిగృహాలు ఉండగా 43 బాలుర కోసం మరో 11 బాలికల కోసం కేటాయించారు. ఆయా వసతిగృహాల్లో దాదాపు 5 వేల మందికిపైగా విద్యార్థులు 3 నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో పదో తరగతి విద్యార్థులు 800 మందికిపైగా ఉన్నారు. ఆయా విద్యార్థులకు గణితం, ఆంగ్లం, హిందీ, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ సంక్షేమ హాస్టళ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్స్, నెలనెల డైట్‌చార్జీలు చెల్లింపులో నాటి ప్రభుత్వం తీవ్రజాప్యం చేసింది. కొన్ని హాస్టళ్లలో వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీర్చాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహాల్లో రాత్రి పూట విద్యార్థుల్ని చదివించడానికి 2019కి ముందు ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్యూటర్స్ నియామకం అటకెక్కింది. ఈ పరిస్థితుల్లో హాస్టళ్లలోని విద్యార్థుల అవసరాలు, ఆకలితో పాటు చదువులు కూడా అడుగంటిపోయాయి. ఈ పరిస్థితులను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. ఇందులో భాగంగా విద్యలో ఇతర విద్యార్థులతో సమానంగా మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో తొలుత బీసీ వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేకంగా బోధకుల్ని నియమించాలని యోచిస్తున్నది. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత వసతిగృహాల్లో డిజిటల్ క్లాసులు ప్రారంభించనున్నారు. ఈ క్లాసుల్లో సబ్జెక్టుల వారీగా బోధనతోపాటు సందేహాలు నివృత్తి చేయనున్నారు. ఇందుకోసం వసతిగృహాల్లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించి అక్కడ ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు ఏర్పాటు చేస్తారు. బోధించే ట్యూటర్‌కు గౌరవ వేతనంగా రూ.1500 నుంచి రూ.2వేలు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. తొలుత నాలుగు హాస్టళ్లలో డిజటల్ క్లాసుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు.

పోస్టు కోసం.. పట్టు



గుంటూరు విజిలెన్స్ కార్యాలయం

విజిలెన్స్ ఏవో సీటుకు సిఫార్సులు

పోటీ పడుతున్న వ్యవసాయాధికారులు

గుంటూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్‌లో వ్యవసాయ శాఖ అధికారి పోస్టు కోసం పోటీ నెలకొంది. అనేక దాడులు.. ఆదాయ మార్గాలు పుష్కలంగా ఉండటంతో ఈ పోస్టు కోసం సుమారు డజను మంది వ్యవసాయశాఖలోని ఏవోలు పోటీ పడుతున్నారు. పోస్టు దక్కించుకునేందుకు జోన్ -3 పరిధిలోని ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన వ్యవసాయ అధికారులు పావులు కదుపుతున్నారు. అందుకోసం భారీగా వెచ్చించేందుకు సిద్ధపడినట్లు తెలుస్తుంది. ముఖ్య రాజకీయ నాయకులతో సిఫార్సులు చేయించేందుకు పలువురు రంగం సిద్ధం చేసుకున్నారు. గుంటూరులోని విజిలెన్స్ కార్యాలయంలో ఇప్పటివరకు ఏవోగా పనిచేసిన రమణకుమార్‌ను మాతృ శాఖకు పంపిస్తూ డీజీ హరీష్‌కుమార్‌గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. రెండేళ్ల క్రితం రమణకుమార్‌ను ఈ పోస్టులో నియమించారు. ఇప్పుడు ఖాళీగా ఉన్న పోస్టులో కొత్త వారిని నియమించడం అనివార్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు ఏవోలు ఈ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్ల కాల వ్యవధితో డెప్యూటేషన్ వేయించుకునేందుకు పలువురు ప్రయత్నాలు ప్రారంభించారు. విజిలెన్స్ డీజీ ఈ నియామకం చేపట్టాల్సి ఉంది. హోంమంత్రి ద్వారా సిఫార్సు చేయించుకునేందుకు ఆసక్తి కలిగిన అధికారులు పావులు కదుపుతున్నారని తెలిసింది.

ఎవరి ప్రయత్నాలు వారివే..

విజిలెన్స్ ఏవో పోస్టు కోసం ప్రకాశం జిల్లాకు చెందిన కొందరు అధికారులు తీవ్రంగా పోటీపడుతున్నారు. అక్కడ ఉన్న అధికారికి ముఖ్య నేతలు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పల్నాడు ప్రాంతానికి చెందిన కొందరు ఏవోలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ ఒక సీనియర్ నేత వారికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. హోంమంత్రితో కూడిన వ్యవహారం కావటంతో సీనియర్ నేతలను పలువురు ఏవోలు ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఓ ముఖ్య నేత వద్దకు ఒకరిద్దరు ఏవో లు వెళ్లగా శాఖపై పట్టున్న వారికే తాను సిఫార్సు చేస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. ఏదో అసలో.. ఏది నకిలీనో.. తెలిసిన వారికి ఈ పోస్టు దక్కటం న్యాయం అని ఆయన చెప్పినట్లు సమాచారం.

ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల.. క్షేత్ర పరిశీలన ఎప్పుడు..?

- ఇప్పటివరకు దాఖలు చేసిన అప్లికేషన్ల స్టేటస్‌లన్నీ పెండింగ్
- ఏఈఆర్‌వో, ఈఆర్‌వో రిమార్కులు రాయని పరిస్థితి
- బీఎల్‌వోల నియామకంలోనూ అస్పష్టత

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గంలో ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులు దాఖలు చేస్తున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. నిత్యం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వస్తున్న అప్లికేషన్లను ఎప్పటికప్పుడు బీఎల్‌వోలకు పంపించి క్షేత్ర పరిశీలన చేయించడం లేదు. అసలు ఈ ఎన్నిక ఓటరు నమోదుకు బీఎల్‌వోలు ఎవరనేది ఇంతవరకు స్పష్టం లేకుండా పోయింది. దరఖాస్తులు మాత్రం ఏఈఆర్‌వో ఆఫీసుల్లో అందుబాటులో ఉంచారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొంటున్న అప్లికేషన్లకు రిఫరెన్స్ నెంబరు ఇస్తున్నారు. దానికి సంబంధించి స్టేటస్ ట్రాకింగ్ చేస్తే రెండు వారాల క్రితం ఎలా ఉందో ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నది. ఏఈఆర్‌వో, ఈఆర్‌వో రిమార్కులు నమోదు చేస్తేనే స్టేటస్ అప్‌డేట్ అవుతుంది. గతంలో చివరి రోజు వరకు దరఖాస్తులను అలానే ఉంచి సిబ్బందితో కార్యాలయాల్లో కొన్నింటిని ఆమోదించి, తిరస్కరించేవారు. దాంతో చాలామంది అర్హులు ఓటరుగా నమోదు అయ్యేవారు కాదు.

ఆ పరిస్థితుల్లో మళ్లీ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పెట్టుకొని నిరీక్షించేవారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అయ్యేలా ఉన్నది. గత నెల 30వ తేదీన పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు నమోదు కోసం నోటిఫికేషన్ విడుదల జరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 16వ తేదీన రీ పబ్లికేషన్ కూడా చేశారు. అలానే 25వ తేదీన రెండో రీపబ్లికేషన్ కూడా జరగనుంది. నవంబరు 6వ తేదీ వరకు మాత్రమే అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. నేటి ఐటీ యుగంలో చాలామంది ఆన్‌లైన్‌లోనే ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకొంటున్నారు.



సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లో పెండింగ్ చూపిస్తున్న ఎమ్మెల్సీ ఓటర్ల అప్లికేషన్

ఇక ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు పలుచోట్ల శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తు చేయిస్తున్నారు కొన్ని సంఘాలైతే గంపగుత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. ఒకపక్క జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి గంపగుత్తగా దరఖాస్తులు ఆమోదించబోమని చెబుతున్నప్పటికీ ఎన్‌జీవోలు మాత్రం స్వీకరిస్తూనే ఉన్నాయి.

వేల సంఖ్యలో దరఖాస్తులు

కాగా ఇప్పటికే రెండు జిల్లాల నుంచి వేల సంఖ్యలో పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో పెట్టుకొన్నారు. వాటిని ఎవరితో ఎప్పుడు క్షేత్ర పరిశీలన చేయిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది.

మరోవైపు గడువు తేదీ మూడు వారాల్లోకి వచ్చేసింది. నవంబరు 23న ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే ఆ తర్వాత ఓటరుగా నమోదు కావడం చాలా కష్టం అవుతుంది. ఈ నేపథ్యంలో తమ దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా బీఎల్‌వోలతో పరిశీలన చేయించి పరిష్కరించాలని పట్టభద్రులు కోరుతున్నారు. ఒకవేళ దరఖాస్తులో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకొని మరోసారి అప్లై చేసుకోవడానికి అవకాశం ఉంటుం దని, చివరి నిమిషం వరకు తేల్చకుండా నాన్చితే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు.



గుంటూరు అరండల్‌పేట ఆర్వోబీకి కేంద్రం అధికారిక ఆమోదం

- ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఉత్తర్వుల జారీ
- సేతు బంధన్ పథకం కింద మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటన
- రెండేళ్లలో పూర్తి చేయాలని ఆదేశం

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని అరండల్‌పేట ఆర్‌వోబీ నాలుగు లేన్ల విస్తరణ - నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సీఆర్ఐఎఫ్ పథకం కింద సేతు బంధన్ పథకం ద్వారా గుంటూరు - నల్లపాడు రైల్వే సెక్షన్ పరిధిలోని ఈ ఆర్వోబీ నిర్మాణానికి రూ.98 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా ఆదేశాలను బుధవారం జారీ చేసింది. ఏపీ రోడ్, ట్రాన్స్ పోర్ట్ అండ్ బిల్డింగ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సింగ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్లలో ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో గుంటూరు పార్లమెంటు పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో 3 - 4 రోజుల్లో వెలువడుతుందనుకున్న కేంద్ర ప్రభుత్వ జీవో ముందుగానే రావడంతో గుంటూరు ప్రజలు ఆనందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారిక ప్రకటనను విడుదల చేయడంపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు, అమరావతి అభివృద్ధి కోసం పాటుపడే కూటమి ప్రభుత్వానికి మాత్రమే ఈ తరహా విజయాలు సాధ్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఏపీ అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు.

24 నుంచి ఏఎన్‌యూ యూత్ ఫెస్టివల్స్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ యూత్ ఫెస్టివల్స్ ఈనెల 24 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు యూత్ ఫెస్టివల్స్ 2024 కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్ మురళీమోహన్ బుధవారం తెలిపారు. యూత్ ఫెస్టివల్స్ కు సంబంధించి అన్ని కళాశాలలకు సమాచారం పంపామని పేర్కొన్నారు. మ్యూజిక్, థియేటర్, ఫైన్ ఆర్ట్స్, క్విజ్ , లిటరరీ ఈవెంట్స్ అంశాలలో విద్యార్థులకు పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకత, సాంస్కృతిక పోటీలలో ప్రతిభను ప్రదర్శించేందుకు యూత్ ఫెస్టివల్స్ ఒక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. యూత్ ఫెస్టివల్స్ కు అడిషనల్ కోఆర్డినేటర్ గా ప్రొఫెసర్ పి .జాన్సన్ వ్యవహరిస్తారని మురళీమోహన్ తెలిపారు.

ప్రారంభమైన ఫార్మసీ పరీక్షలు

పెదకాకాని, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ పరీక్షలు బుధవారం సజావుగా ప్రారంభమయ్యాయని పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఆయన విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆయా విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రోజు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షల పకడ్బందీగా నిర్వహించేందుకు అబ్జర్వర్లను, స్క్వాడ్ బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు.

8న చదరంగం పోటీలకు ఎంపికలు

గుంటూరు(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 గుంటూరు చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అండర్ 14, 17 బాల బాలికలకు చదరంగం పోటీలు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలోన్ని స్కూల్స్ విద్యార్థులు పాల్గొనవచ్చుని తెలిపారు. ఎంపికైన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. విద్యార్థులు పాఠశాలల నుంచి వయసు ధృవీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఎంపికలకు రావాలని సూచించారు.

గుంటూరు క్లబ్ విషయంలో...

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్లబ్బులలో పేకాట విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పాటించాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా రిక్రియేషన్ క్లబ్బులను ప్రారంభించిన విషయం విదితమే. దీనిలో భాగంగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా రిక్రియేషన్ క్లబ్‌లను పోలీసులు మూయించారు. 13 ముక్కల రమ్మీ ఆట జూదం కిందకి రాదని, దానికి గతంలోనే చట్టబద్ధత కల్పించారు. ఈ విషయమై గతంలో సుప్రీంకోర్టు కూడా క్లబ్‌లలో 13 ముక్కల రమ్మీ ఆడుకోవచ్చని తీర్పు ఇచ్చింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో 13 ముక్కల రమ్మీని కూడా జూదం కింద చేరుస్తూ నిషేధించింది. దీన్ని అనుసరించే జిల్లాలోని క్లబ్బులను పోలీసులు మూయించారు. ఈ నేపథ్యంలో గుంటూరు క్లబ్‌లో 13 ముక్కల రమ్మీ ఆటను నిలిపివేయాలంటూ నల్లపాడు పోలీసులు క్లబ్బును మూయించారు. దీంతో క్లబ్ కార్యదర్శి నల్లమోతు సాంబశివరావు హైకోర్టును ఆశ్రయించారు. క్లబ్ తరపున హైకోర్టు సీనియర్ న్యాయవాది వలేటి లక్ష్మీనారాయణ తన వాదనలు వినిపించారు. 13 ముక్కల రమ్మీ జూదం కాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాటించాలని హైకోర్టు స్పష్టం చేస్తూ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేసును వచ్చే వారానికి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గురువారం నుంచి క్లబ్ లో 13 ముక్కల రమ్మీ ఆడుకోవడానికి మార్గం సుగమం అయిందని న్యాయవాది లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు.

కొత్త మద్యం దుకాణాల వద్ద కోలాహలం

గుంటూరు కార్పొరేషన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దయిపోయి.... ప్రైవేటు మద్యం దుకాణాలు అమల్లోకి వచ్చాయి. అయితే బుధవారం మధ్యాహ్నం వరకు సరిగా మద్యం సరఫరా జరగలేదు. మధ్యాహ్నం రెండు గంటల లోపు మద్యం ఆయా షాపులకు చేరుకోకపోవడంతో మద్యం బాబులు నిరాశ వ్యక్తం చేశారు. ఎప్పుడు మద్యం వస్తుందని మద్యం బాబులు ఎంతగానో ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. సాయంత్రానికి కొన్ని షాపులకు మద్య చేరుకోవడంతో పరుగులు పడితే వెళ్లి, క్యూలైన్లో నిలబడి మద్యాన్ని కొనుగోలు చేశారు. సాయంత్రం వేళలో ఆయా మద్యం దుకాణాల వద్ద కొనుగోలుదారుల కోలాహలాం నెలకొంది.



సర్కార్ మద్యం గోల్‌మాల్

- మాల్స్, దుకాణాలలో సరుకు పక్కదారి
- ఎక్సైజ్ కానిస్టేబుల్ చేతివాటం
- అధికారుల తీరుపైనా అనుమానాలు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రైవేటు సిబ్బంది
- అనేక దుకాణాలలో అవకతవకలు
- నిల్వలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

ఒంగోలులో రూ.5 కోట్లు మాయం


ఒంగోలు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్కార్ దుకాణాల్లో మద్యం అమ్మకాలలో గోల్‌మాల్ జరిగింది. సిబ్బంది చేతివాటం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి ప్రభుత్వ ఖజానాకు కోట్లలో గండిపడింది. ఒంగోలులో సుమారు రూ.5కోట్ల మేర అవకతవకలు జరిగాయని ప్రాథమికంగా అంచనా. జిల్లావ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలలో కూడా ఇదే తరహాగా నిధులు మాయమైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలు మంగమ్మ కాలేజీ వద్ద ఉన్న మాల్‌లో రూ.1.65 కోట్ల నిధులు మాయమైనట్లు అక్కడ పనిచేసే సిబ్బంది ఎస్పీ .దామోదర్‌కు మంగళవారం ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో ఎక్సైజ్ శాఖ ఉలికిపాటుకు గురైంది. హడావుడిగా అధికారులు జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలలో నిల్వలతోపాటు అక్కడ ఫర్నిచర్‌ను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో ఆయా మద్యం దుకాణాలలో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడుతున్నాయి. మద్యం డిపోల నుంచి వచ్చిన బాటిళ్ల దుకాణాలలో స్కాన్ చేసిన తర్వాత మాత్రమే విక్రయించాలి. అందుకు విరుద్ధంగా అమ్మకాలు చేసి కొందరు సిబ్బంది భారీగా జేబులు నింపుకొన్నట్లు తెలుస్తోంది.

ఒంగోలులో బార్లకు మద్యం అమ్మకాలు

ఒంగోలులో 18 మద్యం దుకాణాలు, రెండు మాల్స్ ఉన్నాయి. అక్కడ ప్రైవేటు వ్యక్తులు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తుంటారు. వారిపై పర్యవేక్షణకు ఒక సీఐ, ఎస్ఐ, ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఆయా దుకాణాలకు డిపోల నుంచి మద్యం వస్తుంది. రోజూ విక్రయాల ద్వారా వచ్చిన నగదు బ్యాంక్‌లో జమచేయాలి. అలా చేస్తున్నారా.. లేదా? నిల్వ ఎంత ఉంది అని ఎక్సైజ్ అధికారులు చూడాలి. నగరంలో పది మద్యం దుకాణాలు, రెండు మాల్స్‌కు ఒక కానిస్టేబుల్ ఇన్‌చార్జి గా ఉన్నారు. అయితే సదరు కానిస్టేబుల్ దుకాణాలలోని మద్యం పెట్టెలను బార్లకు విక్రయించినట్లు తెలిసింది. అంతేకాకుండా స్కాన్ చేయకుండా విక్రయాలు చేసి ఆ మొత్తాన్ని సిబ్బంది, కానిస్టేబుల్ కలిసి స్వాహా చేశారని సమాచారం. 2022 నుంచి ఇప్పటివరకు మంగమ్మ కాలేజీ వద్ద ఉన్న మాల్‌లో రూ.1.65 కోట్లు, మంగమూరు రోడ్డు జంక్షన్ సమీపంలో ఉన్న మాల్‌లో రూ.95 లక్షలు నిధులు గోల్ మాల్ అయినట్లు సమాచారం. అదేవిధంగా మిగిలిన మద్యం దుకాణాలలో మరో రూ.2.50కోట్లకుపైగా అవకతవకలు ఉన్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం

ఈ వ్యవహారంలో ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కోట్ల రూపాయలు గోల్‌మాల్ అయితే ఇప్పటి వరకూ గుర్తించకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. మద్యం దుకాణాలకు ఇన్‌చార్జిగా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ వారంలో ఒక రోజు నిల్వలను పరిశీలించాలి. అదేవిధంగా నిత్యం బ్యాంక్‌లో నగదు జమ అవుతున్నాయా లేదా అనేది చూడాలి. అదేవిధంగా ఎక్సైజ్ ఎస్ఐ 15 రోజులకు ఒకసారి, సీఐ నెలరోజులకు ఒకసారి దుకాణాలను తనిఖీ చేసి నిల్వలను సరిచూడాలి. అంతేకాకుండా ఒక దుకాణం డిపోకు రూ.20 లక్షలు బాకీ ఉంటే ఇక నిల్వలు ఇవ్వకూడదు. నిబంధన ఇలా ఉంటే కోట్ల రూపాయల సరుకు దుకాణాలకు రావడం, ఆపై దారిమళ్లడం చూస్తే అంతా తెలిసే జరిగిందని ప్రచారం జరుగుతోంది. అధికారులు పర్యవేక్షణను గాలికొదిలేసి సిబ్బంది ఇచ్చే మామూళ్లకు తలొగ్గి అంటీముట్టనట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..



ఎస్పీకి ఫిర్యాదు చేసిన సిబ్బంది

మంగమ్మ కాలేజీ వద్ద మాల్‌లో పనిచేసే సిబ్బంది అక్కడ జరిగిన అవకతవకల గురించి మంగళవారం ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.1.65 కోట్లు ఎక్సైజ్ కానిస్టేబుల్ కాజేశారని, ఇప్పుడు ఆ పాపం అంతా తమకు చుట్టుకుందని విన్నవించారు. అంతేకాకుండా మాల్‌ను తగలబెట్టేందుకు కానిస్టేబుల్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రెండురోజుల క్రితం సిబ్బందికి చెప్పి ఐదు లీటర్ల పెట్రోలు తెచ్చి తగులబెట్టేందుకు కుట్ర చేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

విచారిస్తున్న పోలీసులు

మద్యం దుకాణాలలో చోటుచేసుకున్న గోల్‌మాల్‌పై ఒంగోలు తాలూకా పోలీసులు విచారణ చేపట్టారు. మాల్స్, మద్యం దుకాణాలకు ఇన్‌చార్జిగా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్‌తోపాటుగా ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్ సీఐని పిలిపించి బుధవారం విచారణ చేశారు. ఏమి జరిగింది, ఎలా నిధులు మాయం అయ్యాయి అనే కోణంలో విచారిస్తున్నారు. కాగా ఎక్సైజ్ అధికారుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేస్తామని సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

అక్రమాలకు పాల్పడ్డ వారిపై కేసులు

\- ఖాజామొహిద్దీన్, ఈఎస్

సర్కార్ మద్యం దుకాణాలలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె. ఖాజామొహిద్దీన్ తెలిపారు. వారిలో ఎక్సైజ్ సిబ్బంది ఉంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని మద్యం దుకాణాలలో ఉన్న ఫర్నిచర్, మద్యం నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నామని వివరించారు.

విద్యుత్‌శాఖ కార్యాలయానికి తాళం

- మోసం చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్
- రోజంతా నిలిచిపోయిన కార్యకలాపాలు
- బిల్లులు చెల్లించే వీలులేక వినియోగదారుల ఇక్కట్లు
- బాధితులతో చర్చించిన అధికారులు


దర్శి విద్యుత్‌శాఖ కార్యాలయానికి వేసిన తాళాలు

దర్శి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నమ్మించి మోసం చేసిన విద్యుత్ శాఖ దర్శి జేఏవో నాదెళ్ల వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితులు దర్శి పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి తాళాలు వేశారు. తమకు న్యాయం చేసేంతవరకూ కదలేదని లేదని భీష్మించారు. దీంతో బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయం విధులు నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించేందుకు వచ్చిన అనేకమంది వినియోగదారులు కార్యాలయం మూతపడటంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. బాధితులతో విద్యుత్‌శాఖ అధికారులు చ ర్చించి కార్యాలయం తెరిచేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దర్శి పట్టణానికి చెందిన రవికృష్ణ, ప్రసన్న దంపతుల భవనంలో విద్యుత్‌శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం నడుస్తోంది. అందులోని ఒక పోర్షన్‌లో డీఈ, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. మరో పోర్షన్‌లో సిబ్బంది విద్యుత్ బిల్లులు కట్టించుకుంటారు. రవికృష్ణ, ప్రసన్నలకు చెందిన ఈ భవనాన్ని గత ఏప్రిల్‌లో విద్యుత్‌శాఖ కార్యాలయానికి అద్దెకు ఇచ్చారు. అద్దె ఖరారు పేరుతో అక్కడ పనిచేస్తున్న జేఏవో వేణుగోపాల్ పలు డాక్యుమెంట్లపై సంతకాలు చేయించుకున్నారు. కొంతకాలం తర్వాత వేణుగోపాల్ అదనంగా ఖాళీ పత్రాలపై సంతకాలు పెట్టించుకున్న డాక్యుమెంట్లపై రవికృష్ణ, ప్రసన్న దంపతుల కు చెందిన భవనం పక్కనగల ఖాళీ స్థలం తనకు విక్రయించినట్లు వేణుగోపాల్ డాక్యుమెంట్లు సృష్టించుకున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విద్యుత్ అధికారులతోపాటు ఎస్పీ కార్యాలయంలో, స్పం దనలో న్యాయం చేయాలని రవికృష్ణ, ప్రసన్న దంపతులు ఫిర్యాదు చేశారు.

అధికారుల విచారణ

ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖకు చెందిన కార్పొరేట్ అధికారులు గత సోమవారం ఇక్కడకు వచ్చి ఈ సంఘటనపై విచారణ చేపట్టి వెళ్లారు. ఈక్రమంలో రవికృష్ణ, ప్రసన్న దంపతులు తమకు న్యాయం చేయాలని, మోసం చేసిన జేఏవో వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్యాలయానికి తాళాలు వేశారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎమర్జెన్సీ ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు ఉంది. ప్రస్తుతం తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నందుకు జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించిన విషయం విదితమే. ఈసమయంలో విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ కార్యాలయం వివాదంతో మూతపడటంతో అధికారులు, సిబ్బంది ఏంచేయాలో పాలుపోలేదు. బాధితులతో డీఈ ఇతర అధికారులు చర్చించారు. ప్రభుత్వ కార్యాలయానికి తాళాలు వేయటం చట్టవిరుద్ధమని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జేఏవో తప్పుచేసినట్లయితే అతనిపై కేసుపెట్టి చట్టపరంగా న్యాయం పొందాలని సూచించారు. సాయంత్రం వరకు విద్యుత్ అధికారులు చర్చలు ఫలించకపోవటంతో వేసిన తాళాలు అలాగే ఉన్నాయి. ఇదిలాఉండగా తనకు రవికృష్ణ అనే వ్యక్తి విద్యుత్ శాఖ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని విక్రయించి కోటి రూపాయలు తీసుకొని ఇప్పుడు తాను మోసం చేశానని అబద్ధం చెబుతున్నాడని జేఏవో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇరువర్గాల్లో ఎవరిది న్యాయమో, ఎవరిది మోసమో విచారణలో తేలాల్సిఉంది. ఆ భవనాన్ని విద్యుత్‌శాఖ అధికారులు అద్దెకు తీసుకొని ఆరునెలలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు అద్దె ఖరారు కాలేదు. ఇంటి యజమానులకు అద్దె చెల్లించలేదు. ఈవిషయంపై కూడా అధికారుల నిర్లక్ష్యవైఖరి అవలంబించారని బాధితులు వాపోయారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఈసంఘటనపై విచారణలో దోషులు ఎవరనే విషయం తేలిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. కార్యాలయానికి తాళాలు వేయటంతో విధులకు ఆటంకం కల్గటం తోపాటు వినియోగదారులు బిల్లులు చెల్లించే వీలులేక ఇబ్బంది పడిన విషయాన్ని ఆంధ్రజ్యోతి ఆయన దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారులు మాట్లాడుతున్నారన్నారు. ఉన్నతాధికారులకు ఇక్కడ జరిగిన సంఘటనలను తెలిపామని చెప్పారు. వెంటనే దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు.

దిద్దుబాటు

- బదిలీల తప్పులు సరిదిద్దే పనిలో తలమునకలైన పంచాయతీ అధికారులు
- గ్రేడ్-5, 6 ఉద్యోగులకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధం
- నేడో, రేపో ముగియనున్న ప్రక్రియ

ఒంగోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం మూడోరోజైన బుధవారం కూడా కొనసాగింది. ఎక్కడికక్కడ టీడీపీ శ్రేణులు ఉత్సా హంగా పాల్గొన్నాయి. జోరువానలోనూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు విచారణ చేసి బదిలీల ఆర్డర్లు ఇచ్చే విషయంలో కార్యాలయ ఉద్యోగులు, కీలక అధికారి అనేక అక్రమాలకు పాల్పడ్డారని నివేదికను అందజేశారు. దీంతో ఆ బదిలీల ప్రక్రియలో



భాగస్వామ్యం ఉన్న ముగ్గురు ఉద్యోగులను కలెక్టర్ తమీమ్ అన్సారియా సస్పెండ్ చేశారు. దీంతో కొంతమంది ఉద్యోగులకు ఇంత వరకు బదిలీల ఆర్డర్లు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రతి రోజూ జిల్లా పంచాయతీ కార్యాలయం వచ్చి తిరిగిపోతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఈ ప్రత్యేక దృష్టిసారించి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు బదిలీ ఉత్తర్వులు అందని ఉద్యోగుల వివరాలను సేకరించి నోట్ ఫైల్ పెట్టాలని ఆదేశించినట్లు సమాచారం.

ఉద్యోగుల వివరాల సేకరణ

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు బదిలీలపై ప్రత్యేక దృష్టిసారించారు. మండలాల వారీగా గ్రేడ్-5. గ్రేడ్-6 ఉద్యోగులు ఎంతమంది బదిలీ అయ్యారు, ఎంతమంది జాయిన్ అయ్యారు, ఇంకా ఉత్తర్వులు అందని వారు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను సేకరిస్తున్నారు. వాటిని ప్రత్యేక ప్రొఫార్మాలో పొందుపరుస్తున్నారు. పూర్తి స్థాయిలో సేకరించి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేయనున్నారు. ఆ జాబి తాను పరిశీలించిన తర్వాత కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు గ్రేడ్-5, 6 ఉద్యోగుల బదిలీల్లో ఒక స్థానానికి ఇద్దరికి ఏమైనా ఆర్డర్లు ఇచ్చారా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. పెద్దారవీడు మండలంలో ఒక పంచాయతీకి ఇరువురు కార్యదర్శులను నియమించడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో వెంటనే ఆ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత ఎంపీడీవోతో మాట్లాడినట్లు తెలుస్తోంది.

సూత్రధారిని వదిలి... పాత్రదారులను పట్టారు

పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది బదిలీల్లో జరిగిన అవకతవకలు, ఆర్థిక లావాదేవీలకు ప్రధాన సూత్రధారిగా ఉన్న నాటి డీపీవోని వదిలేసి పాత్రధారులుగా ఉన్న అప్పటి ఏవో, జూనియర్ అసిస్టెంట్‌లపై వేటు వేయడం హాస్యాస్పదంగా ఉందని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలలుగా బదిలీల ప్రక్రియ జరుగుతుందని, ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నాయన్నారు. బదిలీలపై కలెక్టర్ ఆమోదం తర్వాత కూడా వారంరోజుల పాటు ఉత్తర్వుల కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఆ శాఖ అధికారి పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయిందన్నారు. ఆ అధికారి తీరు వల్ల జిల్లా పంచాయతీ పరువు బజారున పడిందన్నారు. ఈ లావాదేవీలన్నింటినిపై విచారణ చేసి వాస్తవాలు బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


రంగా విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి


పేదల పెన్నిధి రంగా

- ఎమ్మెల్యే ఏలూరి
- కాంస్య విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

చినగంజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల హృదయాలలో వంగవీటి మోహనరంగా చెరగని ముద్ర వేసి పేదల పెన్నిధిగా నిలిచారని ఎమ్మెల్యే ఏఏలూరి సాంబశివరావు అన్నారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో సుమారు రూ25 లక్షలతో నిర్మించే కాపు నేత స్వర్గీయ వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహానికి, బస్టాండ్‌కి బుధవారం ఆయన సోపిరాల గ్రామ పెద్దలతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ఏలూరిని గ్రామ పెద్దలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రంగా కుమారుడు రాధా తనకు మంచి ఆప్తమిత్రుడన్నారు. ఆయన తండ్రి విగ్ర హ ఏర్పాటు తన చేతులమీదుగా జరగడం ఆనందంగా ఉందన్నారు. రంగా ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అనంతరం సోపిరాల పెద్దలు ఎమ్మెల్యే ఏలూరిని ఘనంగా సన్మానించారు. ఆయనకు పలు సమస్యలపై అర్జీలను ప్రజలు అందజేశారు. పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్, సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూ రి రాఘవయ్య, సోపిరాల గ్రామ పెద్దలు డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు, పర్వతరెడ్డి సత్యనారాయణ, తుమ్మలపెంట సీతారామయ్య, కుర్రి రామ సుబ్బారావు, టి.సుబ్బారావు, ఎస్.హరనాథ్‌బాబు, మహిళలు పాల్గొన్నారు.

ఇది మీకు తెలుసా ...!

సెక్షన్ 196పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం టచ్ ఫోన్లు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ద్వారా సమాచార బదిలీ వేగవంతం అయింది. ఈ నేపథ్యంలో ఆయా మాధ్యమాల్లో చేసే పోస్టులు, వ్యాఖ్యలకు సంబంధించి స్వీయనియంత్రణ అవస రం. లేదంటే సెక్షన్ 196 (ఐపీసీ సెక్షన్153ఏకి అనుగుణంగా జోడించబడింది) ప్రకారం శిక్షార్హమైన నేరం అవుతుందని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఉపన్యాసాలు, రచనలు, హావభావాలు, కనిపించే ప్రాతినిధ్యాలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, ఇతర ఏవిధమైన చర్యల ద్వారానైనా ప్రాంతీయ భాష, జాతి, కులం, మతం, వర్గం ప్రాతిపదికలపై శతుత్వ భావాన్ని, ద్వేషభావాన్ని, వ్యతిరేకతను, మనస్పర్థలను ప్రేరేపించడం, అందుకు ప్రయత్నించడం శిక్షార్హమైన నేరమని సెక్షన్ 196లో ఉన్నట్లు చెప్తున్నారు. వాట్సాప్ ద్వారా లేదా ఇతర మాధ్యమాల ద్వారా పంపే సందేశాలు, లేదా ఉపన్యాసాల విషయంలో స్వీయ నియంత్రణ అవసరం. సమాజంలో అశాంతిని, ఉద్రేకపూరిత వాతావరణం కలిగించే విధంగా రెచ్చగొట్టే వాఖ్యలు చేయడం నైతికంగా సరైన పద్ధతి కాదని సమాజ హితులు అభిప్రాయపడుతున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలు, వాటి విశిష్టత, ప్రాముఖ్యతలకు సంబంధించిన అంశాలు చాలా సున్నితమైనవి. వాటిపై వ్యాఖ్యలు లేదా అభిప్రాయాలు మాధ్యమాల్లో వ్యక్తపరిచేటపుడు స్వీయనియంత్రణ లేకుంటే తిప్పలు తప్పవని అధికారులు చెప్తున్నారు. స్వీయనియంత్రణ అన్నింటికీ మంచింది. సమాజానికీ మంచిది.

ఈ-పంట నమోదుతోనే ప్రభుత్వ రాయితీలు

డీఏవో రామకృష్ణ

పంగులూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలను ఈ - పంటలో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని కొండమూరు గ్రామంలో ఈ-పంట నమోదు వివరాలపై రైతులతో నిర్వహించిన గ్రామ సభలో డీఏవో రామకృష్ణ మాట్లాడారు. రైతుకు ఉచిత బీమా సౌకర్యం వర్తించాలన్నా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటకు నష్టపరిహారం, సున్నా వడ్డీ లభించాలన్నా, ఉత్పత్తులకు మద్దతు ధర దక్కాలన్నా పంట నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. సర్పంచ్ బండి శివకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఏవో సుబ్బారెడ్డి, అంజయ్య, శ్రీనివాసరావు, రైతు సేవా కేంద్రం అధికారులు దినేష్, శివాని, పృధ్వీ, ఫిలిఫ్స్, రైతులు పాల్గొన్నారు. సాగులో ఉన్న మినుము పైరును డీఏవో అధికారులతో కలిసి


రేణంగివరంలో మొలకెత్తిన మినుమును డీఏవోకు చూపిస్తున్న రైతులు

పరిశీలించారు. కొండమూరు, రేణంగివరం గ్రామాలలో వర్షం కారణంగా కోత దశకు చేరుకున్న మినుములో మొలక వచ్చిందని, పంట చేతికి దక్కే పరిస్థితి లేదని రైతులు మొరపెట్టుకున్నారు. 950 ఎకరాలలో కోత దశలో ఉన్న మినుముకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదిక ఉన్నతాధికారలుకు పంపినట్లు రామకృష్ణ తెలిపారు.

సాగులో మెలకువలు పాటించాలి

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయ అధికారి కుమారి సూచించారు. కొమ్మినేనివారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి పంటను ఏవో పరిశీలించారు. వరిలో జింకు లోపం లేకుండా రైతులు జింక్ సల్ఫేడ్‌ను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : పంటసాగులో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. చందలూరులో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రబీలో సాగు చేసే శనగ, పొగాకులో ఎరువుల వినియోగం, పురుగు, తెగుళ్ల నివారణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టారావు, సుబ్బారావు, రైతు సేవాకేంద్ర అధికారి ప్రియ, రైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా తమ్మవరం రోడ్డు

- భారీ వాహనాలతో ఛిద్రం
- ప్రయాణికుల అవస్థలు


గుంతలతో ఉన్న తమ్మవరం రోడ్డు

మేదరమెట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను పట్టించుకోకపోవడంతో రోడ్లన్నీ గోతులమయమై వాహనచోదకులకు నరకం చూపిస్తున్నాయి. దాదాపు అన్ని రహదారులూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ద్విచక్రవాహనాలు కూడా వెళ్లడానికి వీలు లేనంతగా గుంతలు పడ్డాయి. మేదరమెట్ల నుంచి తమ్మవరం వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులతో నిండిపోయింది. 2007 సంవత్సరంలో ప్రధాన మంత్రి సడక్ యోజన కార్యక్రమంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. తరువాత ఒక్కసారి పైన మరో లేయర్ తారు వేశారు. పైన వేసిన లేయర్ ఎక్కువ భాగం లేచిపోయింది. రోడ్డు మెతక ఉన్న చోట గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ్మవరం కొండ నుంచి భారీ ఎత్తున గ్రావెల్ అక్రమంగా బయటకు తరలించడంతో ఒక్కొక్కటి 50 టన్నుల బరువు ఉన్న టిప్పర్లు ఈ రోడ్డు నుంచే వెళ్లాయి. ఇక్కడున్న సిమెంట్ పైపుల కంపెనీ లారీలు, భారీ యంత్రాలను తయరు చేసే మరో ఫ్యాక్టరీ వాహనాలతో పాటు రేషన్ బియ్యం నిల్వ చేసే భారీ గోడౌన్‌లు, పొగాకు కంపెనీ వీటి అన్నింటికీ మించి ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సామగ్రి లారీలు రావాడంతో రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారింది. ఇక్కడ నుంచి వెళ్లే ప్రతి వాహనం అధిక బరువుతో వెళ్లడం వలన రోడ్డు పూర్తిగా గుంతలు పడడంతోపాటు కంకర లేచి ద్విచక్ర వాహనాలు పడిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. నాలుగు రోజుల కిందట రాళ్ల లేచిన చోట ఎవరో కొద్దిగా ఎర్రమట్టి పోశారు. జాతీయ రహదారులు నిర్మించడానికి ఒక రకమైన పద్ధతి, రాష్ట్రీయ రహదారులు నిర్మించడానికి ఓ పద్ధతి, జిల్లా స్థాయిలోని గ్రామాల రోడ్డులను మరో పద్ధతిలో వేస్తారు. గ్రామీణ రోడ్లు 25 టన్నుల వాహనాలు వేళ్లేలా రోడ్డు నిర్మిస్తారు. అయితే ఇ క్కడ 50 టన్నులకు మించిన వాహనాలు తిరగడం వలన రోడ్డు ధ్వంసమవుతు న్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. దీనికి తోడు కల్వర్టు వద్ద సిమెంట్ రోడ్డు రెండు వైపులా కుంగిపోయి పెద్ద గుంతలు పడ్డా యి. భారీ వాహనాలు తిరగడం వలనే ఇ లా రోడ్డు


కల్వర్టుకు రెండు వైపులా కూలిన రోడ్డు

కూలిపోయింది. దాదాపు 3 వేల జనాభా ఉన్న తమ్మవరం గ్రామస్థులతో పాటు ప్రభుత్వానికి అత్యధిక మొత్తంలో పన్నులు చెల్లించే పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు ఇ క్కడ ఉన్న గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. పం చాయతీ రాజ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులతో పాటు ని ర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మద్యం అక్రమ విక్రయాల కట్టడికి పటిష్ట చర్యలు

ఎస్పీ తుషార్ డూడి



ఎస్ఐతో మాట్లాడుతున్న ఎస్పీ డూడి


చినగంజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమ రవణా, విక్రయాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుషార్ డూడి అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించి, నేర రికార్డులను చూశారు. పేకాట, కోడి పందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలపై నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, వారు ఏమి చేస్తున్నారు, ఎటువంటి వ్యక్తులను కలుస్తున్నారో దృష్టి పెట్టాలన్నారు. వారు నేరలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పల్లె నిద్ర, విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం వలన నేరాలను తగ్గించవచ్చునన్నారు. ప్రజలకు, విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాల గురించి, సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి చైతన్యం తీసుకురావాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని గస్తీ, పెట్రోలింగ్ విధులు పటిష్టంగా నిర్వహించాలని ఎస్పీ డూడి సూచించారు. వరదనీరు బ్రిడ్జిలు, కల్వర్టులు, రోడ్లపై నుంచి ప్రవహిస్తుంటే ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉండే వారిని సురక్షితమైన పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వరద ప్రభావ ప్రాంతాలపై ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్‌ను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు.

శ్రీదేవికి మంత్రి గొట్టిపాటి నివాళి


శ్రీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్

సంతమాగులూరు, అక్టోబరు 16 : మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, జడ్పీటీసీ సభ్యులు చింతా రామారావు సతీమణి శ్రీదేవి (56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య రామారావు ఇంటికి వెళ్లి శ్రీదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

అద్దంకి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండు గొర్రెలు మృతి చెందాయి. స్థా నికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెంపరాల కు చెందిన దుద్దారి వెంకటరావుకు చెందిన గొర్రెల మంద శాంతినగర్ వైపు పొలాల నుంచి బుధవారం రాత్రి ఇంటికి వస్తుండగా రెండు గొర్రెలు దర్గా సమీపంలో రోడ్డు వెం బడి ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకుతూ వెళ్లాయి. ఆ సమయంలో విద్యుత్ ప్రసరణ జరిగి అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.50 వేలు ఉం టుందని బాధితుడు వెంకటరావు తెలిపారు.



నీటమునిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

కాలనీవాసులకు అండగా ఉంటాం

డాక్టర్ మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని అబ్దుల్ కలాం కాలనీలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీటితో ఇబ్బంది పడుతున్న వారిని బుధవారం టీడీపీ నియోజకవర్గ అధికారి ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ కాలనీ వాసులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని చెప్పారు. వర్షం నీటితో మగ్గం గుంటలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న ఓ చేనేత కార్మికునికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు చేపట్టేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలీస్ విచారణ పారదర్శకంగా జరగాలి

మాజీ మంత్రి డాక్టర్ పాలేటి

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు మృతి యాక్సిడెంట్ కాదని, హత్య కోణంలో విచారణ పారదర్శకంగా జరపాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు డిమాండ్ చేశారు. తన ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలేటి మాట్లాడుతూ జరిగింది హత్య అయితే పోలీసులు దాన్ని ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. వాస్తవ కోణంలో ఆలోచించకుంటే తనవంతు పాత్ర తాను పోషించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్‌లో మరొకరికి ఈ పరిస్థితి ఎదురుకాకుండా ముందస్తుగా తాను మానవతా దృక్పథంతో ముందుకొచ్చానన్నారు. ఘటనా స్థలంలో తాను గమినించిన అంశాలను, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, కొందరు ముఖ్యులు చెప్పిన మాటల ఆధారంగా తాను పోలీస్ చర్యలపై ఆరోపణలు చేస్తున్నానని పేర్కొన్నారు.

కొత్త మద్యం షాపులు రెడీ

సరుకు తెప్పించిన అత్యధిక షాపుల లైసెన్స్‌దారులు



సరుకును దించుతున్న సిబ్బంది

అద్దంకి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : కొత్త మద్యం షాపుల ప్రారంభానికి చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 23 మద్యం షాపులు ఉండగా బుధవారం సాయంత్రానికి నిర్వాహకులు అత్యధి కంగా షాపులకు ప్రారంభిం చారు. మరి కొందరు గురువారం మద్యం తీసుకు వచ్చేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. గురువారం నుంచి ఎక్కువ షాపులలో మద్యం అమ్మకాలు ప్రారంభించనున్నారు. రెండు రోజులు కిందట ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసి వేయడం, కొత్త మద్యం షాపులు తెరవడం ఆలస్యం అవుతుండడంతో మద్యం ప్రియులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. కొత్త బ్రాండ్‌ల మద్యం అందుబాటులోకి రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండడంతో ప్రస్తుతం ప్రారంభించే మద్యం షాపులలోనూ పాత మద్యం అమ్మే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

పోటెత్తిన మద్యం ప్రియులు

ప్రారంభమైన ఒకేఒక్క షాప్ వద్ద బారులుతీరిన వైనం

పర్చూరు, అక్టోబరు, 16 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలంలో నాలుగు మద్యం దుకాణాలకు ప్రభుత్వ అనుమతి లభించింది. అయితే బుధవారం ఒకే ఒక్క వైన్ షాప్ ప్రారంభించడంతో మందుబాబులు పోటెత్తారు. నిన్నటి వరకూ నాసిరకం మద్యంను ఎక్కువ ధరకు కొని తాగామని, నాణ్యమైన మందు తక్కువ ధరకు లభిస్తుండడంతో పెద్ద ఎత్తున కొనుగోలుకు పోటీ పడ్డారు.

120 మద్యం సీసాలు స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్లారెడ్డిపాలెంలో కిరాణాషాప్ నిర్వహిస్తున్న వ్యక్తి మద్యంను అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 120 (క్వార్టర్) రాయల్ స్టాగ్ సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను ఎస్సై వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

23 నుంచి రెవెన్యూ సదస్సులు

అద్దంకి, అక్టోబరు 16 : మండలంలోని పలు గ్రామాలలో ఈనెల 23 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. 23వ తేదీన నరసింహాపురం రెవెన్యూ గ్రామానికి సంబంధించి చక్రాయపాలెం గ్రామ సచివాలయం వద్ద, 25వ తేదీన ధర్మవరం గ్రామ సచివాలయం వద్ద, 26వ తేదీన శంఖవరప్పాడు గ్రామ సచివాలయం వద్ద, 29వ తేదీన ఉప్పలపాడు గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

ఆగని వర్షం

- పొంగిప్రవహిస్తున్న వాగులు
- స్తంభించిన రాకపోకలు
- గుండ్లకమ్మ నదిలో పెరిగిన నీటి వరద



గుండ్లకమ్మ నదిలో అద్దంకి సమీపంలో ప్రవహిస్తున్న వరద నీరు



పొంగుతున్న పర్చూరు - కారంచేడు మధ్య ఓగేరు వాగు

అద్దంకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రాంతంలో బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు పడ్డాయి. ఉదయం సమయంలో ఒకింత వాన ఆగినా అనంతరం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇప్పటికే పూర్తి స్థాయిలో నిండిన భవనాసి చెరువు అలుగు పారుతోంది. జాలర్లు చేపల వేటను సాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలతో గుండ్లకమ్మ నదిలో వరద నీటి ప్రవాహం బాగా పెరిగింది. దీంతో గుండ్లకమ్మ నదిలో ఉన్న ఊటబావుల చుట్టూ వరద నీరు చేరింది. బుధవారం రాత్రి నుంచి గుండ్లకమ్మ నదిలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో నల్లవాగు, చిలకలేరు, దోర్నపు వాగు, భవనాసి వాగు లు కూడా నిండు గా ప్రవహిస్తున్నాయి. రోజంతా వర్షపు జల్లులు పడడంతో ప్రజల రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది.

ఇంకొల్లు : వర్షాలకు పాతమద్రాసు రోడ్డులోని పాతమద్రాసు రోడ్డులో వంకాయలపాడు, దుద్దుకూరు గ్రామాల వద్ద వాగులపై ఉన్న నేలచప్టాల మీదగా నీరు ఉధృతంగా ప్రవహిస్తోం ది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంకొల్లు ఒంగోలు వెళ్లే రోడ్డులో దుద్దుకూరు వద్ద వాగు పారుతోంది. పర్చూరు వెళ్లే రోడ్డు వంకాయలపాడు వద్ద వాగు పా రుతుండడంతో బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి.

నీట మునిగిన పంటలు

పర్చూరు : మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. శివారు కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై భారీగా నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పర్చూరు - కారంచేడు వైపు ప్రవహించే ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలను ముంచెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వందల ఎకరాల్లో సాగుచేసుకున్న మిర్చి, వైట్‌బర్లీ మొక్కలు, కారంచేడు పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసిన పంట పొలాలు నీటమునిగాయి. అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. పర్చూరు- కారంచేడు ఓగేరు వాగు కర కట్టలు బలహీన పడ్డాయి. అక్కడక్కడా గండ్లు ఏర్పడ్డంతో రైతులు ఆందోళన చెందుతున్నారు



ఉధృతంగా ప్రవహిస్తున్న దుద్దుకూరు వాగు



కారంచేడు సమీపంలో వాగును తలపిస్తున్న పంట పొలాలు



పర్చూరు సమీపంలో నీట మునిగిన మిర్చి

పల్లెలకు పూర్వ వైభవం

ఎమ్మెల్యే ఏలూరి



పెదగంజాం వద్ద వరదనీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే పల్లెల అభివృద్ధికి బాటలు వేస్తూ వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చినగంజాం, సోపిరాల గ్రామాల్లో రూ.89.50లక్షల వ్యయంతో నిర్మించనున్న ఏడు అంతర్గత సిమెంట్ రోడ్లకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఏ లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లు పల్లెలన్నీ అంధకారంలో మగ్గాయన్నారు. స్థానిక సంస్థలను వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారన్నారు. వైసీపీ నిరంకుశ పాలనలో నిధులన్నీ పక్కదారి పట్టాయన్నారు. పల్లెల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులను దారిమళ్లించి దుర్వినియోగం చేశారన్నారు. ఈ కారణంగా పల్లెలలో కనీస సౌకర్యాల అమలుకు నోచుకోలేదన్నారు. పంచాయతీలలో సర్పంచులు, పాలకవర్గం ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. ఎన్నికల సమయంలో హామీ మేరకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా రోడ్లు, డ్రైన్లు, తాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. గ్రామాల సుస్థిర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రచిస్తూ దశలవారీగా గ్రామాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అన్నదాతలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంట కాలువల ఆధునీకరణ, వరద కాలువల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. పెదగంజాం, రాజుబంగారుపాలెం గ్రామాల మధ్య గల ఎన్టీఆర్ వారిధి సమీపంలోని తూములవాగు ఉధృతిని ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజలతో మట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. అధికార యంత్రాగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్థానికులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పెదగంజాం వాసులకు ఇబ్బంది లేకుండా తూములవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, రోడ్డు ఎత్తును పెంచి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామని ఏలూరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, డీటీ శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఈఈ రామకృష్ణ, ఏఈ కే.రామచంద్రుడు, ఉపాధిహామీ పీడీ విజయలక్ష్మీ, ఏపీవో లక్ష్మీదేవి, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉపసర్పంచ్ రాఘవయ్య, నాయకులు పొద వీరయ్య, టి.జయరావు, ఆసోది సుబ్బారెడ్డి, అజాద్, పి.పార్థసారిధి, నక్కల వీరరాఘవులు, నరహరి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా ముందడుగు



సీసీ రోడ్డుకు భూమి చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల) : ప్రగతి పథంలో ప ల్లెటూళ్లు అభివృద్ధి సాధిచేందుకు ప్రభుత్వం ముందడుగు వేసే క్రమంలో పల్లెపండుగ వారోత్సవాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. వేటపాలెంలో రూ.2లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కొండయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించడంపై ప్రజ లు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన చెప్పారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : ఉపాధి నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టడంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకుందని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ముప్పవరం, జాగర్లమూడివారిపాలెం, కొండమూరు గ్రామాలలో సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోపీఆర్డీ కె.సుమంత్, ఏపీవో సంతోషం, నోడల్ అధికారి కె.నాగభూషణం, నేతలు ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, సర్పంచు రౌతు సాంబశివరావు, శివ కుమారి, కార్యదర్శులు బేగం, ఖాన్, ఈసీ మురళి, సచివాలయ, ఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : గ్రామాలలో మౌలికసదుపాయాలు కల్పించడమే పల్లె పండుగ లక్ష్యమని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. పావులూరు, నక్కలపాలెంలో బుధవారం రోడ్డు పనులకు భూమి పూజ చే స్తారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, సర్పంచ్ లుథియమ్మ, ఏపీవో రేణుక, రాంబాబు, వెంకట్రావు, రవి, నాయకులు పాల్గొన్నారు.

నేడు పాల్గొనున్న మంత్రి

అద్దంకి : పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు మండలంలోని మోదేపల్లిలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేస్తారని ఎంపీడీవో శింగయ్య తెలిపారు.

పర్చూరు : పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీడీవో ప్రద్యు మ్నకుమార్ అన్నారు. చిన్ననందిపాడు, అడుసుమల్లి, గొల్లపూడి, భూషాయపాలెం గ్రా మాల్లో రూ.50లక్షల విలువ చేసే సీసీ రోడ్లు, మినీ గోగులాల నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, సీని యర్ నాయకులు చెరుకూరి చింపయ్య, దొప్పలపూడి ఆదినారాయణ, శివరాం, ఇవోఆర్డి కొసనా సత్యనారాయణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : పల్లెల్లో వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. బుధవారం మండలంలోని పేరాయపాలెం, కుంకుబాడు, కోటికలపూడి గ్రామాలల్లో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. పేరాయపాలెంలో పలు ప్రాంతాలల్లో రూ.30లక్షలతో, కోటికలపూడిలో రూ.40లక్షలతో, కుంకపాడులో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాదరావు, ఏపీవో దుర్గాగాయత్రి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఈసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : గ్రామాలల్లో మౌళిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధా న్యతను ఇస్తుందని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం రావినూతలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఏబీసీ కాలువలో ఉన్న సాగర్ నీరు

ఏబీసీకి నిలిచిన సాగర్ నీరు

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ నీటిని పూర్తిగా నిలిపి వేయించింది. అద్దంకి బ్రాంచ్ కాలువకు వచ్చే 17వ మైలు వద్ద కాలువకు లీకేజ్ ఉండడం, భారీ వర్షాలు పడుతుండడంతో పంట పొలాలు మునిగి పోకుండా ఏబీసీకి వచ్చే నీటిని జీరో శాతం తగ్గించారు. లీకేజీ మరమ్మతు పనులు పూర్తి అయిన ఏబీసీకి మాత్రం నీటి విడుదల చేయకుండా అధికారులు తగు జాగ్రత్తలు పాటిస్తున్నారు. వర్షాలు తగ్గు ముఖం పట్టాక తిరిగి ఏబీసీ కాలువలకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతున్నారు. రైతులు కూడా ఇప్పుడు నీటితో అవసరం లేదని కాలువ ద్వారా నీరు వస్తే పంట పోలాలు మునక వేస్తాయని అంటున్నారు. బల్లికురవ మండలం వల్లాపల్లి వద్ద ఉన్న 33వ మైలు వద్ద ఏబీసీ కాలువ పూర్తిగా అడుగంటింది. అధికారులు మరో నాలుగు రోజుల్లో తిరిగి కాలువలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను కలిసిన సీపీఐ నారాయణ

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను బుధవారం సీపీఐ జాతీయ నాయకుడు కే నారాయణ కలిశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలు అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. అనంతరం నారాయణను ఎమ్మెల్యే కొండయ్య సత్కరించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి : ఎమ్మెల్యే

ఉడ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజ్ఞ హాస్పటల్‌ను బుధవారం ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు కొంత సేవాభావంతో మెరుగైన వైద్యసేవలనందించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, గుండె వైద్యనిపులు డాక్టర్ పృధ్వీ శ్రీనివాస్, షుగర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ బి.మంజువాణి, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కంటి పరీక్షల కేంద్రం మూత

- వృద్ధులకు తిప్పలు
- పునరుద్ధరించాలని విజ్ఞప్తి



అద్దంకి సీహెచ్‌సీలో మూసిఉన్న విజన్ సెంటర్ కంటి పరీక్షలు నిలిపివేసినట్లు ఏర్పాటు చేసిన స్టిక్కర్

అద్దంకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలలో కం టి చూపు పరీక్షలు నిలిపి వేయడం తో వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. వైసీపీ పాలనలో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ గడువు ముగియడంతో కంటి పరీక్షలను నిలిపి వేశారు. ఈ క్రమంలో అద్దంకి సీ హెచ్‌సీలో ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం కూడా సుమారు నెల రోజు ల నుంచి కంటి పరీక్షలు నిలిపి వేశారు. గతంలో ప్రతి రోజు సరాసరి 30 నుంచి 50 మందికి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో కంటి పరీక్షలు చేసుకుంటుంటారు. వీరిలో అవసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ కూడా జరిగేది. అద్దంకి పట్టణం, మండలంతో పాటు సమీపంలో ఉన్న ఐదారు మండలాల నుంచి కూడా వృద్ధులు, కంటి చూపు మందగించిన వ్యక్తులు అద్దంకి సీహెచ్‌సీకి వస్తుంటారు. దీంతో కంటి పరీక్షల కోసం ప్రైవేట్ వైద్యశాలలకు లేదా ఉచిత వైద్య శిబిరాల వద్దకు వెళ్లాల్సి వస్తుందని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి సీహెచ్‌సీలో కంటి చూపు పరీక్షలను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

చేపల దొంగల పంట పండింది

ఊరచెరువులో యథేచ్ఛగా వేట

ఇంకొల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దుద్దుకూరులో రెండు రోజులుగా చేపల దొంగల పంట పండింది. గ్రామంలో దేవదాయ శాఖకు చెందిన ఊరచెరువులో యథేచ్ఛగా చేపల వేట సాగుతోంది. ఈ చెరువులో చాలా కాలంగా చేపలు పట్టకపోవడంతో చేపలు బాగా పెద్ద సైజులో పెరిగాయి. చెరువుకు ఒక కాపలాదారు ఉన్నారు. గ్రామానికి చెందిన కొందరూ రాత్రివేళ దొంగతనంగా చేపలను పడుతున్నారు. దీనిని ఏ అధికారి పట్టించుకోలేదు. గ్రామస్థులు కూడా మౌనంగా ఉన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో చెరువులో నీరు ఎక్కువగా చేరింది. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా కొందరు పెద్దపెద్ద చేపలను పట్టుకుంటున్నారు. బుధవారం సుమారు రూ.10వేల విలువైన చేపలను పట్టి అమ్ముకున్నారు. గ్రామస్థులు దేవదాయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు.